
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
గురువారం 24 ఏప్రిల్ 2025



ఉష్ణోగ్రత (అంచనా)

23-4-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	40	27
తెనాలి	39	27
నరసరావుపేట	41	24
బాపట్ల	37	28
రెంటచింతల	42	25

పదిలో 11వ స్థానం



పావని చంద్రికకు మిఠాయి తినిపిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

జిల్లాలో 84.15 శాతం ఉత్తీర్ణత

- గత ఏడాది కంటే తగ్గిన ఉత్తీర్ణత
- పదో తరగతి ఫలితాల్లో బాలికలదే పైచేయి

598 మార్కులతో జిల్లా టాపర్ పావని చంద్రిక

కారంపూడి మండలం ఒప్పిచర్ల జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పావని చంద్రిక 600కు 598 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచింది. పావనిని జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అభినందించారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉత్తీర్ణత సాధించాయన్నారు. పావని జిల్లాలో ప్రథమ స్థానంలో నిలవడంతో పాటు, రాష్ట్ర స్థాయిలో మొదటి పది స్థానాల్లో నిలవడం మాచర్ల నియోజకవర్గానికే గర్వకారణమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి విద్యార్థిని, ఆమె తల్లిదండ్రులకు, పాఠశాల ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు.

నరసరావుపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ బుధవారం విడుదల చేసి పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 84.15 శాతం ఉత్తీర్ణతతో జిల్లా పదకొండో స్థానంలో నిలిచింది. గత ఏడాది కంటే ఉత్తీర్ణత 1.9 శాతం తగ్గింది. గత నెలలో జరిగిన పరీక్షలకు 25,382 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా వీరిలో 21,358 మంది ఉత్తీర్ణులయ్యారు. 12,720 మంది బాలురు, 12,662 మంది బాలికలు పరీక్షలకు హాజరుకాగా 10,353 మంది బాలురు, 11,005 మంది బాలికలు ఉత్తీర్ణులయ్యారు. బాలురు 81.39 శాతం, బాలికలు 86.91 శాతం పాసయ్యారు. బాలురు కంటే బాలికలే అధికంగా పాసయ్యారు. ఇక 16,887 మంది విద్యార్థులు ప్రథమ శ్రేణిలో, 3,070 మంది ద్వితీయ శ్రేణిలో, 1,401 మంది తృతీయ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు. 4,024 మంది విద్యార్థులు పరీక్షల్లో ఫెయిల్ అయ్యారు.



ప్రభుత్వ స్కూల్స్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ సూరజ్, డీఈవో చంద్రకళ

వీరికి ఉత్తమ మార్కులు..

జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారు. 598 మార్కులతో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిన అంగడి పావని చంద్రిక ఒప్పిచర్ల జడ్పీ హైస్కూల్. ఇక మాచర్ల జడ్పీ హైస్కూల్‌కు చెందిన షేక్ సమీరా 596, తూబాడు జడ్పీ హైస్కూల్ విద్యార్థిని ప్రత్తిపాటి అమూల్య 593 మార్కులు సాధించారు. ఇక తేనీరు సాయిరామ్, పిట్టల విజయలక్ష్మి, జంపకానాలు కాజిత, విప్పర్ల చాతుర్య 591 మార్కులు సాధించారు. చప్పాల నవ్య, గంజనబోయిన రాధిక, అనుమకొండ రేవతి, కోనేటి కావ్యశ్రీ 590 మార్కులు సాధించారు.

విద్యార్థులకు కలెక్టర్ సత్కారం

ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కలెక్టర్ అరుణ్‌బాబు కలెక్టరేట్‌లో సత్కరించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అసాధారణ ప్రతిభ చూపారని కలెక్టర్ కొనియాడారు. గత విద్యా సంవత్సరంలో 18వ స్థానంలో ఉన్న జిల్లా ఏడాది 11వ స్థానంలో నిలిచిందన్నారు. అద్భుత ఫలితాలు సాధించడానికి కృషి చేసిన డీఈవో చంద్రకళ, విద్యాశాఖ సిబ్బంది, ఉపాధ్యాయులను అభినందించారు. ఈ స్ఫూర్తితో వచ్చే విద్యా సంవత్సరంలో మరింత గొప్ప ఫలితాలు సాధించేలా పని చేయాలని కలెక్టర్ సూచించారు. డీఈవో చంద్రకళ మాట్లాడుతూ కలెక్టర్ తీసుకున్న చర్యల వల్లే జిల్లా మెరుగైన ఫలితాలు సాధించినట్లు తెలిపారు. ఎస్సీఈఆర్‌టీ మెటీరియల్‌కు అదనంగా సులభంగా పరీక్షలకు సిద్ధమయ్యేందుకు కలెక్టర్ ప్రత్యేక మెటీరియల్ తయారు చేయించి విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేయించారన్నారు. హాస్టళ్లను సందర్శించి విద్యార్థులకు మెటీరియల్ అందిందా, లేదా అని కలెక్టర్ స్వయంగా పరిశీలించారన్నారు. 7, 8 తరగతుల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్న కలెక్టర్ ఆదేశాలను పాటిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో చంద్రకళ, జేసీ సూరజ్, డీఆర్వో మురళి తదితరులు పాల్గొన్నారు.



597 మార్కులు సాధించిన లక్ష్మీసాత్విక

కావ్యశ్రీని దత్తత తీసుకున్న కలెక్టర్

590 మార్కులు సాధించిన కారెంపూడి జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని కోనేటి కావ్యశ్రీని కలెక్టర్ దత్తత తీసుకున్నారు. ఉన్నత చదువులకు ఇబ్బంది లేకుండా చూస్తానని విద్యార్థిని తల్లిదండ్రులు రామయ్య, కోటేశ్వరమ్మలకు హామీ ఇచ్చారు. కలెక్టర్ స్ఫూర్తితో ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ రాజనాయక్ 598 మార్కులు సాధించిన పావని చంద్రికను దత్తత తీసుకున్నారు.

కవలలకు.. 519 మార్కులు

సత్తెనపల్లి: సత్తెనపల్లికి చెందిన అప్పాపురపు వెంకట సుధాకరరావు, పద్మజల కుమార్తెలు దేవీబాలరష్మిత, సుష్మిత ఇద్దరూ 519 సాధించారు. కవలలు అయిన వీరిద్దరికీ ఒకే విధంగా మార్కులు సాధించటంతో వారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. సత్తెనపల్లికి చెందిన డీ లక్ష్మీసాత్విక 597 మార్కులు సాధించింది.



దేవి బాల రష్మిత, సుష్మితలు

బిల్లులు.. బాధలు

మూడు జిల్లాల్లో రూ.కోట్లలో పెండింగ్



- పూర్తయిన పనులకు నెలలుగా విడుదల కాని నగదు
- అప్పుల పాలై వడ్డీలు కట్టలేక పోతున్నామని నేతల ఆవేదన
- బిల్లులు వస్తే చాలు.. కొత్త పనుల జోలికి వెళ్లబోమంటున్న నేతలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

- పల్నాడు జిల్లాలో 80.49 కోట్లు.., బాపట్ల జిల్లాలో రూ.58.18 కోట్లు.., గుంటూరు జిల్లాలో రూ.15.79 కోట్లు.. ఇలా బిల్లులు పేరుకుపోయాయి.
- పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద చేసిన పనులకు సంబంధించి రూ.154.46 కోట్ల బిల్లులు చెల్లింపులు నిలిచిపోయాయి.
- పల్నాడు జిల్లాలో 702కు 513, బాపట్ల జిల్లాలో 691కు 539, గుంటూరు జిల్లాలో 383కు 259 మినీ గోకులం షెడ్ల నిర్మాణాలు పూర్తి అయ్యాయి. అయితే ముందుగా చెప్పిన విధంగా విడతల వారీగా బిల్లులు చెల్లింపులు జరగడంలేదు. మూడు జిల్లాల్లో రూ.19 కోట్ల వరకు బిల్లులు చెల్లించాల్సి ఉన్నట్లు అధికారుల లెక్కలు తెలియజేస్తున్నాయి.
- 2019కి ముందు గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలో దాదాపు రూ.106 కోట్లు బిల్లుల బకాయిలు ఉన్నట్లు పశు సంవర్ధకశాఖ లెక్కలు తెలియజేస్తున్నాయి.

మన ప్రభుత్వం వచ్చింది.. పనులు చేస్తే వెంటనే బిల్లులు వస్తాయి.. అని అప్పులు చేసి పనులు చేసిన కూటమి పార్టీల్లోని ద్వితీయ శ్రేణి నేతలు అప్పుల పాలై అల్లాడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెద్దఎత్తున అభివృద్ధి పనులు మంజూరయ్యాయి. దీంతో గ్రామ, మండల స్థాయిల్లో నేతలు పెద్దఎత్తున పనులు చేపట్టారు. సీసీ రోడ్లు, మురుగు కాల్వలు వంటి పనులను పెద్దఎత్తున చేశారు. అయితే పను లు పూర్తి చేసి నెలలు గడుస్తున్నా, వాటికి సంబంధించి బిల్లులు రావడంలేదు. బిల్లులు ఇప్పించాలని కొన్ని చోట్ల ఎమ్మెల్యేలపై నేతలు ఒత్తిడి తెస్తున్నారు. బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరుగుతుండటంతో పనులు ఇస్తాం తీసుకోమంటున్నా ఎవరూ ముందుకు రావడం లేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. పార్టీ గెలుపు కోసం ఎంతో శ్రమించాం.. ప్రగతి పనులు చేస్తే కొంత ఆదాయం వస్తుందనే ఆశతో టీడీపీ నేతలు చాలావరకు అప్పులు చేసి మరీ ఉపాధి హామీ పథకం కింద పనులు చేశారు. ఈ బిల్లులు కూడా నెలల తరబడి చెల్లించ డంలేదు. పల్లె పండుగ పథకం ప్రారంభంలో వారం వారం బిల్లుల చెల్లింపులు జరిగాయి. మొదటి రెండు వారాలు చెల్లింపులు సక్రమంగా జరిగాయి. దీంతో బిల్లులు వెంటనే వస్తాయనే ఆశతో పలువురు పెద్దఎత్తున పనులు చేశారు. బిల్లుల చెల్లింపులు నిలిచి పోవడంతో వారు ఖంగుతిన్నారు.

గతంలోనూ.. ఇప్పుడూ ఒకతీరు

గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో కూడా పార్టీ నేతలు పెద్దఎత్తున పనులు చేపట్టారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆయా బిల్లులను ఆపేసింది. దీంతో చాలామంది అప్పులు పాలయ్యారు. కొందరు కోర్టులను ఆశ్రయించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పాత బిల్లులు చెల్లిస్తారని పలువురు ఆశపడ్డారు. అయితే పాత బిల్లుల ఊసే ప్రభుత్వం ఎత్తకపోతుండటంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో వలె కాకుండా పనులు చేసిన వెంటనే బిల్లులు చెల్లిస్తారనే ఆశతో పనులు పెద్దఎత్తున చేపట్టగా గతంలోని పరిస్థితి ఎదురవడంతో నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బిల్లులు చెల్లింపు విషయంలో పనులు చేసిన నేతలకు ప్రభుత్వం చుక్కలు చూపెడుతోంది. పనులు చేసి అప్పులు పాలయ్యామని వడ్డీలు కట్టలేక పోతున్నామంటూ నేతలు ఎమ్మెల్యేల ఎదుట ఆవేదన వక్తం చేస్తున్నారు. గతంలో, ఇప్పుడు బిల్లులు నిలిచిపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సీసీ రోడ్డు



గోకులం షెడ్

మొక్కజొన్న పేరుతో.. మెక్కేస్తున్నారు.

- అడ్వాన్స్‌డు రైల్వే ర్యాక్ బుకింగ్... ఆపై వసూళ్ల పర్వం
- ర్యాక్‌కు రూ. 3 నుంచి రూ. 4 లక్షల డిమాండ్!
- ఒక్క తెనాలి నుంచే లక్ష టన్నుల మొక్కజొన్నలు రవాణా
- గత వైసీపీ ప్రభుత్వ కాలంలో మొదలైన వసూళ్లు
- డెల్టాలో అధికార, ప్రతిపక్ష పార్టీ అనుచరుల మధ్య వసూళ్ల వివాదం



తెనాలి రైల్వే స్టేషన్‌లో రైల్వే గూడ్స్ వ్యాగన్‌కు సరకు లోడ్ చేసేందుకు వరుసలో ఉన్న మొక్కజొన్న లారీ

మొక్కజొన్న పండించిన రైతు... వారి దగ్గర నుంచి పంట కొనుగోలు చేసిన వ్యాపారులు... ఇద్దరూ కాదని వీరి మధ్యలో వసూళ్ల రాయు ళ్లు. వారికి అధికార పార్టీ నేతల అండదండలు. వెరసి రైల్వే గూడ్స్ వ్యాగన్‌ల వ్యవహారం రాజకీయ రంగు పులుముకుంది. ఆనాడు అధికారాన్ని అడ్డుపెట్టుకుని వైసీపీ ప్రభుత్వ కాలంలో వసూళ్ల పర్వానికి తెరలేపితే, నేడు కూటమి నేతల మధ్య అదే అగ్గి రాజేస్తోంది. తమ వారికి వసూలు చేసుకునే అవకాశం కావాలంటే... లేదు మా వారే వసూలు చేసుకుంటారంటూ తెనాలి, బాపట్ల, విజయవాడ, ఏలూరు ప్రాం తాల వ్యాపారుల తరపున నేతలు వత్తిడి చేయటం చూస్తే ఇది మంచి ఆదాయ వనరుగా కనిపిస్తుంది. రూ. లక్షో రూ. 2 లక్షలో కాకుండా రూ. కోటిన్నర ఆదాయాన్ని లక్ష్యంగా పెట్టుకుని అధికార పార్టీ నేతలు దందాకు తెరతీశారు. దీంతో ఈ వ్యవహారం కాస్తా ప్రభుత్వ పెద్దల దృష్టికి చేరిపోవటం, మీరెవరూ వద్దని, వ్యాపారుల మధ్యలో వేలుపెడితే ఊరుకునేదిలేదంటూ చివాట్లు పెట్టటం కొసమెరుపు. ఎగుమతి 'సుంకాల' వ్యవహారానికి సంబంధించి వివరాల్లోకి వెళితే...

గుంటూరు, బాపట్ల, తెనాలి, ఏప్రిల్ 23, (ఆంధ్రజ్యోతి): కృష్ణా పశ్చిమ డెల్టాలో రబీ కింద మొక్కజొన్న, జొన్న పంటలు సాగవుతున్నాయి. 5.71 లక్షల ఎకరాల విస్తీర్ణంలో 4.5 లక్షల ఎకరాల వరకు మొక్కజొన్న, జొన్న పంటలు సాగవుతుంటే, దిగుబడులు ఈ సంవత్సరం ఆశాజనకంగా నే ఉన్నాయి. అయితే మొక్కజొన్నకు మద్దతు ధరతో పోల్చితే పర్వాలేదనిపించేలా మార్కెట్ రేటు ఉన్నా, తెల్ల జొన్నకు రేటు లేదు. అయితే రైతులు మాత్రం పండించిన పంట ను నిల్వ ఉంచుకునే అవకాశం లేక, ఆ ధైర్యంకూడా చేయలేక వ్యాపారులకే వచ్చిన ధరకు అమ్మేస్తున్నారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల పరిధిలో ఉన్న మొత్తం సాగు విస్తీర్ణంలో ప్రస్తుతానికి సగం విస్తీర్ణంలో మొక్కజొన్న, జొన్న కోత పూర్తయితే, మరి కొంత విస్తీర్ణం మే, జూన్ నెలల్లో పూర్తవుతుంది. చిన్న వ్యాపారులు ఇప్పటికే మొక్కజొన్న, జొన్న రైతుల నుంచి కొంటున్నారు. అయితే వీటిని ఎగుమతి దారులకు అమ్మకాలు సాగించాల్సి ఉంది. అది జరగాలంటే సరకు ఇతర రాష్ట్రాలకు పంపేందుకు రైల్వే ర్యాక్‌లు అవస రం అవుతుంది. ఇక్కడే అసలు రాజకీయం మొదలవుతోంది.

ర్యాక్‌ల వసూళ్ల రగడ వైసీపీ ప్రభుత్వ కాలం నుంచే...

వ్యాపారులు తాము కొన్న సరకు ను ఇతర రాష్ట్రాలు, దేశాలకు పం పాలంటే మనకు అనుకూలంగా ఉన్నది రైల్వే రవాణా వ్యవస్థే కీలకం. దీనికోసం రైల్వే ర్యాక్‌లను బుక్ చేసుకోవలసి ఉంటుంది. ఒక్కో ర్యాక్‌లో 2,500 టన్నుల సరకు రవా ణా చేసేందుకు అవకాశం ఉంటుం ది. ఇంత మొత్తంలో ఒకే వ్యాపారి కొనలేరు కనుక కొంత మంది వ్యా పారులు కలసి ఒక ర్యాక్ చొప్పున బుక్ చేసుకుని సరకును తమిళనాడు, కర్నాటక వంటి రాష్ట్రాలకు పంపుతారు. అక్కడి ఎగుమతి దారులు ఆ సరకును దింపుకుని ఇతర దేశాలకు ఎగుమతి చేసుకోవ టం పరిపాటి. అయితే ఇక్కడే ర్యాక్ ల లొల్లి మొదలయింది. గూడ్స్ వ్యా గన్‌ల అవసరాన్ని గుర్తించిన కొందరు దళారులు మధ్యలో చేరిపోయా రు. గత వైసీపీ ప్రభుత్వ కాలం నుంచి ఈ కొత్త దందాకు తెరలేపారు. వ్యాపారుల స్థానంలో కొందరు దళారులు ముందుగానే ర్యాక్‌లు బుక్‌చేసుకుని పెట్టేస్తారు. వ్యాపారులకు అవసరమైన సమయంలో వాటిని తెప్పించి సరకు లోడ్ చేసుకుని పంపాలంటే (మిగతా 8వ పేజీలో)

సర్టిఫికెట్లు.. సతమతం

- డీఎస్సీ దరఖాస్తుదారులకు చిక్కులు
- కుల, ఆధార్, నివాస ధ్రువీకరణ పత్రాల కోసం పాట్లు
- జాయింట్ కలెక్టర్ కార్యాలయంలో స్పందించని సిబ్బంది
- సమీపిస్తున్న గడువు.. నిరుద్యోగ ఉపాధ్యాయుల్లో ఆందోళన

గుంటూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఏడేళ్ల తర్వాత డీఎస్సీ(జిల్లా నియామక కమిటీ)-2025 నోటిఫికేషన్ విడుదలైంది. అయితే ఎంతోకాలంగా డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ ఉపాధ్యాయులు సంతోషించే లోపే సర్టిఫికెట్ల అప్‌లోడింగ్ కోసం పెట్టిన నిబంధనలు చూసి మనోవేదనకు గురౌతున్నారు. గతంలో పరీక్ష రాసేందుకు విద్యార్హతల సర్టిఫికెట్లు మాత్రమే అప్‌లోడింగ్ చేస్తే సరిపోయేది. ఇప్పుడు ఆధార్, కుల, ఆదాయం, నివాస తదితర సర్టిఫికెట్లు అప్‌లోడింగ్ చేయాలని నిబంధన పెట్టారు. అయితే ఈ నిబంధన పురుషులకు ఎలాంటి ఇబ్బంది లేదు. వివాహితులకు సమస్యలు సృష్టిస్తున్నది. ఇందుకు కారణం వారి విద్యార్హతల సర్టిఫికెట్లు తండ్రి ఇంటి పేరుపై ఉండగా ఇతర ధ్రువీకరణ పత్రాలు భర్త ఇంటి పేరుతో ఉంటాయి. ఇప్పుడు వాటిని మార్చుకోవాలంటే పాత సర్టిఫికెట్ల రిఫరెన్స్ నంబర్లను రెవెన్యూ అధికారులు అడుగుతున్నారు. అయితే ఆ రిఫరెన్స్ నంబర్లు లేకపోవడంతో దరఖాస్తుదారులు జాయింట్ కలెక్టర్ కార్యాలయానికి వస్తుండగా సిబ్బంది సరిగా స్పందించడం లేదు. పైగా సీసీఎల్ఏ(భూపరిపాలన ముఖ్య కమిషనర్ కార్యాలయాని)కి వెళ్లమంటూ ఉచిత సలహాలు ఇస్తుండటంతో దరఖాస్తు దారులు ఆవేదన చెందుతున్నారు.

15వ తేదీ వరకే గడువు..

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 1,143 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి గత వారంలో నోటిఫికేషన్ విడుదలైంది. మే 15వ తేదీ లోపు అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉన్నది. ఇందుకోసం తొలుత దరఖాస్తుదారు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆ తర్వాత అందులో ఖాళీలు నింపి, అవసరమైన పత్రాలు అప్‌లోడ్ చేసి నగదు చెల్లిస్తేనే విజయవంతంగా దరఖాస్తు అప్‌లోడింగ్ జరుగుతుంది. ఇక్కడే అసలు సమస్య వచ్చి పడింది. కుల, నివాస, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అవసరం మేరకు ఎప్పటికప్పుడు తహసీల్దారు కార్యాలయాల నుంచి తీసుకొంటుంటారు. సర్టిఫికెట్ తీసుకొన్న ప్రతీసారి రిఫరెన్స్ నంబరు మారిపోతుంటుంది. ఈ నేపథ్యంలో ఇప్పుడు తాజాగా ఆయా సర్టిఫికెట్లు కావాలంటే పాత రిఫరెన్స్ నంబర్లను అడుగుతున్నారు. అవి దరఖాస్తుదారుల వద్ద అందుబాటులో లేవు. గతంలో మీ-సేవ సర్వీసులు ఉన్నప్పుడు వారి వద్ద డేటా ఉండేది. వైసీపీ ప్రభుత్వ హయాంలో సర్వీసులు మీ-సేవ నుంచి తీసేసి గ్రామ/వార్డు సచివాలయాలకు మార్చారో అప్పటి నుంచి పాత రిఫరెన్స్ నంబర్లు కనిపించడం లేదు. ఒకవైపు దరఖాస్తు చేసుకోవడానికి గడవు సమీపిస్తుండగా అధికారుల నుంచి సహకారం అందకపోవడంతో ఔత్సాహికులు ఆందోళన చెందుతున్నారు. తమకు విద్యార్హతలలో ఏ ఇంటి పేరుతో అయితే సర్టిఫికెట్లు ఉన్నాయో వాటి పేరుతోనే కులధ్రువీకరణ, నివాస, ఆదాయం, ఈడబ్ల్యూఎస్ తదితర సర్టిఫికెట్లు మంజూరు చేయాలని వేడుకుంటున్నారు. ఆధార్‌లో పేరులో సవరణలు చేసుకోవడానికి పరిమితి ఉన్నది. జీవితకాలంలో కేవలం రెండేసార్లు పేర్లు అప్‌డేట్ చేసుకోవచ్చు. అంతకుమించి చేయడానికి వీల్లేదు. అయితే ఇప్పటికే చాలామంది తెలియక ఆధార్‌లో పేర్లను అప్‌డేట్ చేసుకున్నారు. దీంతో వారికి తాజాగా మరోసారి మార్పు చేసుకునే అవకాశం లేకుండా పోయింది. ఒక సర్టిఫికెట్‌కి, మరో దానికి ఏమైనా చిన్న మార్పులు ఉంటే తహసీల్దార్లు రెండూ ఒకటే అని ప్రత్యేకంగా గతంలో ధృవీకరించేవారు. ఇప్పుడు ఆలా చేయడంలేదు. ఇలాంటి సమస్యలతో కలెక్టరేట్‌కు వస్తున్న వారికి సహకరించాల్సిన సిబ్బంది అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తుండటంపై అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి తగిన ఆదేశాలను అధికారులకు ఇవ్వాలని అభ్యర్థులు కోరుతున్నారు.

మోదీ సభకు 600 బస్సులు

- జిల్లా నుంచి అమరావతికి జన సమీకరణ
- ఏర్పాట్లపై కలెక్టర్ అరుణ్‌బాబు సమీక్ష

నరసరావుపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో వచ్చే నెల 2న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సభ కోసం జిల్లా యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. అమరావతి సభకు జిల్లా నుంచి జన సమీకరణ ఏర్పాట్లపై కలెక్టర్ అరుణ్‌బాబు కలెక్టరేట్‌లో బుధవారం సమీక్షించారు. జిల్లా నుంచి ప్రజలను తరలించేందుకు 600 వరకు బస్సులను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. జిల్లా నుంచి 30,000 మంది సభకు హాజరు అవుతారని ప్రాథమికంగా అంచనా వేస్తున్నామన్నారు. ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుని నియోజకవర్గ, మండల, గ్రామ, వార్డు సచివాలయ స్థాయిల నుంచి ఎంత మంది ప్రజలు ఏయే మార్గాన సభకు వెళ్లనున్నారో వివరాలు సేకరించాలన్నారు. ఎండలను దృష్టిలో ఉంచుకుని ఎక్కడికక్కడ చల్లని తాగునీరు, మజ్జిగ అందించాలన్నారు. అదేవిధంగా మోదీ సభకు వెళ్లే వారికి భోజన వసతి కూడా సమకూర్చాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జేసీ సూరజ్ ధనుంజయ్ గనోరే, డీఆర్వో మురళి, జిల్లా అటవీ అధికారి కృష్ణప్రియ తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ ఇంజనీరింగ్ సెమిస్టర్ ఫలితాల విడుదల

పెదకాకాని, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన మొదటి సెమిస్టర్ 4/4 ఫలితాలను వర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి ఆలపాటి శివప్రసాదరావు బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 90.12 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. 638 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 578 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. మే నెల ఒకటవ తేదీ వరకు రీవాల్యుయేషన్‌కి అవకాశం ఇస్తున్నట్లు ఆలపాటి శివప్రసాద రావు తెలియజేశారు. పరీక్ష ఫలితాలను వర్సిటీ అధికారిక వెబ్సైట్ లో పొందుపరిచామని తెలిపారు.

పది ఫెయిల్.. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి

ఫిరంగిపురం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ బుధవారం విడుదల చేసిన పదో తరగతి పరీక్షల ఫలితాల్లో ఫిరంగిపురం గ్రామానికి చెందిన పసల వినయ్ కుమార్(16) అనే విద్యార్థి ఫెయిల్ అయ్యాడు. లెక్కల సబ్జెక్టులో తప్పినట్లు తెలుసుకున్న వినయ్‌కుమార్ ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. చుట్టు పక్కల వారు గమనించి స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకు వెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తండ్రి జీవన్‌దాసు కార్పెంటర్ వృత్తి చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. విద్యార్థికి తల్లి నక్షత్రం, చెల్లి తేజ ఉన్నారు.

1,29,798 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,22,419 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,29,798 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 58,020 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			తేజ	10000	13500
334	9500	13000	షార్క్-1	10000	12000
నంబరు.5	10000	12500	బ్యాడిగి 355	10000	13000
273	10000	12400	సింజెంటా		
341	10000	13000	బ్యాడిగి 5531	–	–
4884	10000	11300	దేవనూరుడీలక్స్	10000	12400
సూపర్10	10000	12600	ఆర్మూరు	9800	11000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			తాలుకాయలు	4500	6500

పది ఫలితాల్లో గురుకుల విద్యార్థుల సత్తా

● నూరుశాతం ఫలితాలతో యద్దనపూడి పాఠశాల ప్రథమస్థానం

గుంటూరు(విద్య),ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో ఉమ్మడి జిల్లాలోని గురుకుల పాఠశాలల విద్యార్థులు సత్తాచాటారని కోఆర్డినేటర్ పద్మజ వెల్లడించారు. బాపట్ల జిల్లాలోని యద్దనపూడి గురుకుల పాఠశాలలో నూరుశాతం ఫలితాలు నమోదు అయ్యాయని, ఇక్కడ నుంచి మొత్తం 76 మంది పరీక్షకు హాజరుకాగా అందరూ ఉత్తీర్ణులయ్యారన్నారు. అదేవిధంగా కాకుమాను గురుకుల పాఠశాల 98.65శాతం, తాడికొండ 87.1, అడవితక్కెళ్ళపాడు 78.57, కారంపూడి 88.89, రామకృష్ణాపురం 81.25, అచ్చంపేట 88.89, వీపీసౌత్ 91.84, ఉప్పలపాడు 81.01, అమరావతి 89.56, వినుకొండ 93.51, గురజాల 75.81, యడ్లపాడు 77.78, సత్తెనపల్లి 88.89, బాపట్ల 96, నిజాంపట్నం 87.04, రేపల్లె 88.64, చుండూరు 76.12, నరసాయపాలెం 82.14, నాగులపాలెం 92.13, నార్త్ అద్దంకి 90.66శాతం ఫలితాలు సాధించారని వెల్లడించారు.

సత్తాచాటిన బీసీ హాస్టల్స్ విద్యార్థులు

బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మొత్తం 12 హాస్టల్స్ నుంచి 123 మంది విద్యార్థులు పది పరీక్షలకు హాజరుకాగా వారిలో 113 మంది ఉత్తీర్ణులయ్యారని బీసీ సంక్షేమశాఖాధికారి కే మయూరి వెల్లడించారు. ఇందులో 76 మంది ప్రథమశ్రేణిలో, 25 మంది ద్వితీయ శ్రేణిలో, 12 మంది తృతీయ శ్రేణిలో ఉత్తీర్ణులు అయినట్లు వివరించారు. జిల్లా ఉత్తీర్ణత 88.53శాతం కాగా బీసీ హాస్టల్స్‌లో 91.87శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. తమ హాస్టల్స్‌లో 8 మంది హాస్టల్ విద్యార్థులు 500పైగా మారులు సాధించగా వీరిలో చల్లా శివశేఖర్ 544(పెనుమాక), జీ జగదీష్ 535(ఫిరంగిపురం), పీ శాంతిశ్రీ 532(తాడికొండ), దావూరి సాయిరామ్ 526(తెనాలి), వీవి ఇందు 516(తాడికొండ) మార్కులు సాధించారని వెల్లడించారు.

జిల్లాలోని 14 సాంఘిక సంక్షేమశాఖ హాస్టల్స్ నుంచి 97 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా వారిలో 85 మంది (88శాతం) ఉత్తీర్ణత సాధించారని సాంఘిక సంక్షేమశాఖ ఇన్‌చార్జి డీడీ రాజాడెబోరా వెల్లడించారు. ఉత్తీర్ణులైనవారిలో ప్రథమశ్రేణిలో 58మంది, ద్వితీయ శ్రేణిలో 19మంది, తృతీయ శ్రేణిలో 8 మంది ఉన్నారని తెలిపారు. ఇందులో ఏ రిత్విక(మంగళగిరి) 539 మార్కులు, ముట్లూరి యశ్వంత్(పెదనందిపాడు) 528 మార్కులు, శీలం రేష్మా (రాజాగారి తోట,గుంటూరు) 526 మార్కులు, సౌపాటి సతీష్ (మునిపల్లె) 525 మార్కులు, బీ ప్రసాద్(బృందావన్‌గార్డెన్,గుంటూరు)515 మార్కులు, కే కావ్య(దుగ్గిరాల) 506 మార్కులు, సుమశ్రీ(పొన్నూరు) 502 మార్కులు సాధించినట్లు డీడీ రాజాడెబోరా తెలిపారు.

● జిల్లాలోని గిరిజన సంక్షేమశాఖ హాస్టల్స్ నుంచి 27 మంది విద్యార్థులు పది పరీక్షలకు హాజరుకాగా వారిలో 21 మంది (77.77 శాతం) ఉత్తీర్ణులయ్యారని గిరిజన సంక్షేమశాఖాధికారి మురళి వెల్లడించారు. గురుకుల పాఠశాలల నుంచి 60 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 36 మంది(65.56శాతం) ఉత్తీర్ణత సాధించారు.

నిరంతర సాధనతోనే మెరుగైన ఫలితాలు

● భాష్యం విద్యాసంస్థల చైర్మన్ రామకృష్ణ

గుంటూరు (విద్య) ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తామని, ఇందుకు ఉపాధ్యాయని నిరంతర కృషి తోడు కావడంతో మెరుగైన ఫలితాలు సాధ్యమౌతున్నాయని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. బుధవారం చంద్రమౌళి



విద్యార్థులను అభినందిస్తున్న భాష్యం రామకృష్ణ

నగర్‌లోని మెయిన్ క్యాంపస్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన పదో తరగతి ఫలితాలలో రాష్ట్రంలో తమ విద్యార్థులు అగ్రస్థానంలో నిలిచాయని తెలిపారు. భాష్యం విద్యార్థి వై నేహాంజని 600కి 600 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో అగ్రస్థానంలో నిలిచినట్లు తెలిపారు. అదేవిధంగా కె.ప్రేమ సత్య లిఖిత 599, కె.హర్షిత్ 599, ఎ. లిఖిత 599, పి.వి.ఎస్.ఎస్.శ్రీహాసిని 598, ఎస్. షాలిని సంహిత 598 మార్కులు, ఎం.ప్రియజోషిని 598 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచారని తెలిపారు. గణితంలో 100కు 100 సాధించిన విద్యార్థులు 1088 మంది, సైన్స్ లో 100కు 100 సాధించిన వారు 724 మంది ఉన్నట్లు తెలిపారు. భాష్యం విద్యాసంస్థలు సాధించిన విజయానికి విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ప్రోత్సాహం, సంస్థలపై ఉన్న నమ్మకమే కారణమని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ తదితరులు అభినందించారు.

పది ఫలితాల్లో ఆక్స్‌ఫర్డ్ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు(విద్య),ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో ఆక్స్‌ఫర్డ్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని చైర్మన్ ఫ్రాన్సిస్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ విద్యార్థులు 597 మార్కులు సాధించినట్లు వివరించారు. 590 పైన 9 మంది, 580 పైన 65 మంది, 570 పైన 130



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్లు

మంది, 560 పైన 213 మంది, 550 పైన 281 మంది, 540 మార్కులపైన 351 మంది సాధించారన్నారు. తమ పాఠశాలలో 77 మందికి గణితంలో 100మార్కులు, తెలుగులో 40 మందికి 100 మార్కులు వచ్చినట్లు వివరించారు. ఇంకా సోషల్లో 52 మందికి 100 మార్కులు,సైన్స్‌లో 42 మందికి 100 మార్కులు, హిందీలో 100 మందికి 95 పైన మార్కులు వచ్చాయని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల చైర్మన్ డాక్టర్ ఫ్రాన్సిస్ రెడ్డి, వైస్ చైర్మన్ ఆరోన్‌రెడ్డి, డైరెక్టర్స్ విజయభాస్కర్ రెడి, జోసఫ్ రెడ్డి, ప్రిన్సిపాల్ అమీనా బేగం, వైస్ ప్రిన్సిపాల్ రమాదేవి తదితరులు అభినందించారు.

రైతులకు కొత్త వంగడాలు అందించాలి

● ఎన్‌జీ రంగా వీసీ డాక్టర్ శారదా జయలక్ష్మీదేవి



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీసీ శారదా జయలక్ష్మీ దేవి

లాంఫాం(తాడికొండ)ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రైతుల సూచనలు, సలహాలను దృష్టిలో ఉంచుకుని కొత్త వంగడాలపై సరైన ఫీడ్ బ్యాక్ రైతులకు అందించాలని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ శారదా జయలక్ష్మీదేవి పేర్కొన్నారు. లాంఫాంలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రెండు రోజుల పాటు కృష్ణా మండలం వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా సంఘం సమావేశాన్ని నిర్వహించారు. బుధవారం జరిగిన సమావేశానికి పరిశోధనా సంచాలకులు డాక్టర్ పీవీ సత్యన్నారాయణ అధ్యక్షత వహించారు. ముందుగా లాంఫాం ఏడీఆర్ దుర్గా ప్రసాద్ గత సంవత్సరం జరిగిన పరిశోధనా ప్రగతిని పవర్ పాయింట్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా వీసీ శారదా జయలక్ష్మీదేవి మాట్లాడుతూ సహజ వనరుల పొదుపు, నేల ఆరోగ్యం వంటి పలు అంశాలను పరిగణలోకి తీసుకోవాలని తెలిపారు. వైవిధ్యమైన పంటల సరళి, అత్యధిక పరిశోధన, విస్తరణ కేంద్రాలు గల కృష్ణా మండలంలో నిష్ణాతులైన రైతుల ద్వారా సాగు సమస్యలు, సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. విస్తరణ సంచాలకులు డాక్టర్ జీ శివనారాయణ మాట్లాడుతూ జిల్లా వనరులు, అవసరాలు, పరిస్థితులు దృష్టిలో ఉంచుకొని పరిశోధనలు జరగాలన్నారు. వివిధ జిల్లాల వ్యవసాయ అధికారులు అక్కడి పంటల స్థితిగతులు, పంటల సమస్యలు, మినీకిట్ల పనితీరు తెలియజేస్తూ రానున్న సంవత్సరలో చేపట్టవలసిన పరిశోధనలకు దిశానిర్దేశం చేశారు. అనంతరం రైతులకు ఉపయోగపడే కేవీకే ఘంటశాల, కేవీకే గరికపాడు వారు పలు ప్రచురణలు విడుదల చేశారు. కార్యక్రమంలో ఆరు జిల్లాల జిల్లా వ్యవసాయ అధికారులు, 12 పరిశోధన స్థానాలు, ఆరు విస్తరణ యూనిట్ల శాస్త్రవేత్తలు, వివిధ పంటల ప్రధాన శాస్త్రవేత్తలు, డీఆర్‌ఎస్ అధికారులు, ఆరు జిల్లాల నుంచి అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

ట్యాంకర్‌ను ఢీకొన్న కంటెయినర్

క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్

చికిత్స కోసం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలింపు

చిలకలూరిపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట కొత్త బైపాస్ రోడ్డుపై బుధవారం పురుషోత్తమ పట్నం ఫ్లైవోవర్‌కు సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఖాళీ కంటెయినర్ లారీ క్యాబిన్‌లో తమిళనాడుకు చెందిన డ్రైవర్ ఎన్ మురుగన్ (54) ఇరుక్కుపోయి స్పృహ కోల్పోయాడు. నిద్రమత్తులో ఇతడు రోడ్డు పక్కన డివైడర్ పై ఉన్న మొక్కలకు నీరు పెడుతున్న



క్యాబిన్లో ఇరుక్కుపోయిన డ్రైవర్ మురుగన్



డ్రైవర్‌ను రక్షించేందుకు క్యాబిన్ కట్ చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మరొక ట్యాంకర్ లారీని ఢీకొట్టాడు. దీంతో ఇతడి లారీ క్యాబిన్ పూర్తిగా ధ్వంసమై లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. సమాచారం అందుకున్న చిలకలూరిపేట అర్బన్ పోలీసులు, అగ్నిమాపక దళ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. అర్బన్ సీఐ రమేష్ ఆధ్వర్యంలో హైవే పై ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. ఫైర్ ఆఫీసర్ ఎన్ కిరణ్ కుమార్ రెడ్డి, ఎల్ఎఫ్ వెంకయ్య, అగ్ని మాపక సిబ్బంది లారీ క్యాబిన్ కట్ చేసి డ్రైవర్ మురుగన్‌ను రక్షించారు. తీవ్రంగా గాయపడిన అతడిని 108 వాహనంలో తక్షణ వైద్యచికిత్స చేసి మెరుగైన చికిత్స కోసం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆసుపత్రిలో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

◆ వైద్యులు అందుబాటులో లేకపోవడంపై ఆగ్రహం

◆ డీఎంహెచ్‌వోకు ఫోన్ చేసి తగిన చర్యలు చేపట్టాలని సూచన

భట్టిప్రోలు (కొల్లూరు), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. బుధవారం మండల కేంద్రం భట్టిప్రోలులో ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో రికార్డులను ఎమ్మెల్యే పరిశీలించారు. పట్టికలో హాజరు వేసిన వైద్యులు అక్కడ అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగులకు సరైన సేవలు అందడం లేదని తన దృష్టికి వచ్చినట్లుగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆకస్మిక తనిఖీల్లో కూడా అదే తేటతెల్లం అయ్యిందని మండిపడ్డారు. ఈ విషయంపై



రికార్డులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

డీఎంహెచ్‌వోకు ఫోన్ చేసి ఆరోగ్య కేంద్రం స్థితిగతులు సక్రమంగా లేవని, రోగులకు అందుబాటులో వైద్యులు ఉండటం లేదన్నారు. వెంటనే ఆరోగ్య కేంద్రంపై దృష్టి సారించి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందేలా తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న అన్నక్యాంటీన్ స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. తొలుత టీడీపీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి కార్యాలయంలో కార్యకర్తలతో ముచ్చటించారు. వైద్య కేంద్రం తనిఖీలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో వెంకటరమణ, ఈవోపీఆర్‌డి ఊహారాణి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పశువైద్య సేవలను మరింత చేరువ చేస్తాం

డాక్టర్ సాంబశివరావు

పశుసంవర్ధక శాఖ జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నిక

గుంటూరు సిటీ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పశుసంవర్థక శాఖ ఆఫీసర్స్ సర్వీస్ అసోసియేషన్ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ కే సాంబశివరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేషన్ ఎన్నిక బుధవారం గుంటూరులో నిర్వ



పశుసంవర్ధక శాఖ ఆఫీసర్స్ సర్వీస్ అసోసియేషన్ ను అభినందిస్తున్న జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి నరసింహారావు తదితరులు

హించారు. రాష్ట్ర పశువైద్యాధికారుల సంఘం అధ్యక్షులు డాక్టర్ కల్లూరి సత్యనారాయణ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఉపాధ్యక్షుడిగా డాక్టర్ ఎం నాగేశ్వరరావు, జనరల్ సెక్రటరీగా డాక్టర్ కేవీ జనార్ధనరావు, ట్రెజరర్‌గా డాక్టర్ ఏ మురళీకృష్ణ, జాయింట్ సెక్రటరీగా డాక్టర్ ఎస్ కళావతి ఎన్నికయ్యారు .కొత్తగా ఎన్నికైన వారికి జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఓ నరసింహారావు అభినందనలు తెలిపారు .జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన డాక్టర్ కే సాంబశివరావు మాట్లాడుతూ పశువైద్య సేవలను మరింత చేరువ చేస్తామని, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తూ జిల్లాని ప్రగతి పథంలో ఉంచుతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సర్జన్ లక్కింశెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడిపై వర్సిటీలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ర్యాలీ

పెదకాకాని, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదుల మారణహోమంలో 27 మంది ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని ఏబీవీపీ నాయకులు తెలిపారు. బుధవారం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏఎన్‌యూ శాఖ ఆధ్వర్యంలో బాధితులకు కొవ్వొత్తుల ర్యాలీతో నివాళులర్పించారు. ఈ ర్యాలీలో విద్యార్థులు, పరిశోధకులు పాల్గొని, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఐక్యతను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో రామకాంత్, మోహన్ రావు, గంగాధర్, శివ గణేష్ పాల్గొన్నారు.

విద్యాజ్యోతితో జడ్పీల్లో ఉత్తమ ఫలితాలు

జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా

గుంటూరు సిటీ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ పరిధిలోని పాఠశాలల్లో ఈ సంవత్సరం పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు జడ్పీ ఛైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా అన్నారు. జడ్పీ ద్వారా సరఫరా చేసిన విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ వల్లే ఇటువంటి ఫలితాలు సాధ్యం అయ్యాయన్నారు. బుధవారం పదో తరగతి పరీక్షల ఫలితాలు విడుదలైన తర్వాత జడ్పీ ఛైర్‌పర్సన్ పల్నాడు జిల్లా కారంపూడి మండలం ఒప్పిచర్ల పాఠశాలకు చెందిన అంగటి పావని చంద్రికకు ఫోన్‌చేసి అభినందించారు. మొత్తం 600 మార్కులకు గాను 598 మార్కులు సాధించటం వల్ల పావని ప్రభుత్వ పాఠశాలల గౌరవం నిలబెట్టారని, ప్రధానోపాధ్యాయురాలు లలిత కుమారి కూడా చాలా కష్టపడ్డారని అన్నారు. గుంటూరు జిల్లా 88.53%, పల్నాడు జిల్లా 84.15%,బాపట్ల జిల్లాలో 83.96% మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని జడ్పీ ఛైర్ పర్సన్ పేర్కొన్నారు.

గుంటూరు మీదగా చర్లపల్లి, విశాఖపట్టణంలకు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదగా చర్లపల్లి, విశాఖపట్టణంలకు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 08579 విశాఖపట్టణం - చర్లపల్లి ప్రత్యేక రైలు ఈ నెల 25 నుంచి మే 30వ తేదీ వరకు ప్రతీ శుక్రవారం సాయంత్రం 5.30కి బయలుదేరి అర్ధరాత్రి దాటాక 2 గంటలకు గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి మీదగా మరుసటి రోజు ఉదయం 7.20 గంటలకు చర్లపల్లి చేరుకొంటుంది. నంబరు. 08580 చర్లపల్లి - విశాఖపట్టణం ప్రత్యేక రైలు ఈ నెల 26 నుంచి మే 31 వరకు ప్రతీ శనివారం రాత్రి 7 గంటలకు బయలుదేరి నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి మీదగా రాత్రి 10.40కి గుంటూరు, ఉదయం 8 గంటలకు విశాఖపట్టణం చేరుకొంటుందని సీపీఆర్‌వో తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	116, 124, 135
చికెన్ విత్ స్కిన్(కిలో)	220.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	230.00

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం బుధవారం నాటికి 514.60 అడుగులు ఉంది. ఇది 139.61 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 1350, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 1350 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

లబ్ధిదారులకు రేషన్ సక్రమంగా సరఫరా పంపిణీ

నకరికల్లు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులకు రేషన్ పంపిణీ సక్రమంగా అందేలా డీలర్లు పనిచేయాలని తహసీల్దార్ కే పుల్లారావు ఆదేశాలు జారీ చేశారు. బుధవారం డీలర్లకు, ఎండీయూ ఆపరేటర్లకు సమావేశం నిర్వహించి సూచనలు జారీ చేశారు. ఈకేవైసీ వెంటనే పూర్తి చేయాలన్నారు.

స్లాటు బుకింగ్‌తో పారదర్శక సేవలు

సత్తెనపల్లి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): స్లాటు బుకింగ్ విధానంతో దళారి రహిత పారదర్శక సేవలు లభిస్తాయని స్థానిక సబ్‌రిజిస్ట్రార్ అశోక్ బుధవారం విలేకరులకు తెలిపారు. దీని వల్ల సమయం ఆదాతోపాటు కార్యాలయం చుట్టూ తిరిగే కష్టాలు తగ్గుతాయన్నారు. సత్తెనపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈనెల 26వ తేదీ నుంచి స్లాటు బుకింగ్ విధానాన్ని అమలుచేస్తామన్నారు. స్లాటు బుకింగ్‌కు క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా కూడా చేసుకోవచ్చన్నారు. కక్షిదారులు తమ వివరాలు నమోదు చేశాక డిజిటల్ క్యూ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా రిజిస్ట్రేషన్‌కోసం టోకెన్ తీసుకోవాలని, తరువాత డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్‌కు అవసరమైన సేవలు ఎంపిక చేసుకోవాలన్నారు. స్లాటు బుకింగ్ ముందురోజే ఆన్‌లైన్‌లో డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయటంతోపాటు ఫీజుకూడా ముందుగా చెల్లించవచ్చన్నారు. రోజుకు 36 స్లాట్లను చేయటం జరుగుతుందన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 27.85 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. పవర్ జనరేషన్ ద్వారా 4వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందన్నారు.

అలరించిన సత్యహరిశ్చంద్ర నాటకం

క్రోసూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): క్రోసూరు వేణుగోపాల స్వామి దేవాలయంలో శ్రీరామనవమి ఉత్సవాల 16 రోజుల పండుగ సందర్భంగా బుధవారం రాత్రి ప్రదర్శించిన సత్యహరిశ్చంద్ర నాటకం ప్రేక్షకులను విశేషంగా అలరించింది. స్వర్గీయ బలిజేపల్లి లక్ష్మీకాంత కవి రచించిన ఈ నాటక ప్రదర్శనకు కంభంపాటి గోపాలరావు దర్శకత్వం వహించారు. హరిశ్చంద్ర పాత్రలో శ్రీనివాసుని రామకృష్ణాచార్యులు, గోగిశెట్టి మహేష్, ఆంజనేయులు, చిన సుబ్బారావు, పోలు నరసింహారావుల నటన విశేషంగా అలంరించింది. విశ్వామిత్రుడు, నక్షత్రకుడు, సత్యకీర్తి పాత్రల్లో నటించిన స్థానిక నటులు ప్రేక్షకుల మన్ననలను పొందారు. పాత్రధారులు ఆలపించిన పద్యాలు పేక్షకులను అలరించాయి.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

సత్తెనపల్లి రూరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధూళిపాళ్ళ సమీపంలో కోల్డ్‌స్టోరేజ్ ప్రాంతంలో బుధవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికు లు రూరల్ పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసు లు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతునికి 35-40 సంవత్సరాల వరకు వయసు ఉండవచ్చని, మెరూన్ రంగు షర్టు, గ్రేకలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. మృ తునికి ఆచూకి తెలిసినవారు సత్తెనపల్లి రూరల్ పోలీసు స్టేషన్‌లోగాని, 9440796231 నెంబరుకు సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

బావిలోపడి యువకుడు మృతి

రాజుపాలెం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు యువకుడు కాలువలోపడి మృతిచెందిన సంఘటన మండలంలోని బలిజేపల్లి గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన గడిపర్తి దానియేలు(30) సాయంత్రం ఊరిచివర ఉన్న కాలువలో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలుజారి పడి మృతి చెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి ఇరువురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

మాచర్లటౌన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): బాలిక అదృశ్యంపై బుధవారం పట్టణ పోలీస్‌స్టేషన్లో కేసు నమోదైంది. పట్టణంలోని 23వ వార్డుకు చెందిన బాలిక పదో తరగతి వరకు చదివింది. మంగళవారం రాత్రి ఆ బాలిక కనిపించకుండాపోయింది. అర్ధరాత్రి 2:30 గంటల సమయంలో బాలిక తల్లి మెలకువ వచ్చి చూడగా బాలిక కనిపించలేదు. బంధువుల వద్ద ఆరా తీసినప్పటికీ ఫలితం లేదు. దీంతో బాలిక తల్లిదండ్రులు బుధవారం పట్టణ పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



మాచాయపాలెం వద్ద రోడ్డుపై మొనదేలిన కంకర డస్ట్

కంకర వేశారు.. తారు మరిచారు

బెల్లంకొండ, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని న్యూచిట్యాల ఆర్అండ్ఆర్ సెంటర్ నుంచి పాపాయపాలెం గ్రామం వరకు నూతన రోడ్డు నిర్మాణం కొరకు గుంతలుగా ఉన్న తారురోడ్డును తవ్వి కంకర పరిచారు. సుమారు రెండు నెలలు కావస్తున్నా ఇంతవరకు తారు రోడ్డు వేయలేదు. దీంతో కంకర, డస్ట్ చల్లిన రోడ్డుపై ద్విచక్రవాహనదారులు ప్రయాణించాలంటే నరకయాతన పడుతున్నారు. వాహనాలు వెళ్ళే సమయంలో రోడ్డుపై కంకర, దుమ్ము.. ధూళితో అవస్థలు ఎదుర్కొంటున్నారు. కంకర చల్లటం వల్ల వాహనదారులు పలుమార్లు జారిపడిన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే రహదారి నిర్మాణాన్ని చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



న్యూచిట్యాల గ్రామం వద్ద బస్సు వెళ్తున్న సమయంలో లేస్తున్న దుమ్ము

రామాంజనేయులు సేవలు ఆదర్శనీయం

అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు మాజేటి రామాంజనేయులు విద్యార్థులకు అందించిన సేవలు ఆదర్శనీయం అని పాఠశాల కరస్పాండెంట్ ఆళ్లగడ్డ సురేష్ అన్నారు. ఈనెల చివరికి పదవీవిరమణ చేస్తున్న ఆయనకు బుధవారం పాఠశాల ముగింపు రోజున సన్మానం చేశారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు, బోధనా సిబ్బంది పాల్గొన్నారు.



కర్మ ఫలితం ఎవర్నీ వదలదు..

● లిక్కర్ స్కామ్‌లో సూత్రధారుల అరెస్ట్ తథ్యం
● పీఎస్ఆర్ నన్నూ భయపెట్టాలని చూశాడు
● ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని లిక్కర్ స్కాంలో పాత్రధారులనే కాదు సూత్రధారుల అరెస్టులు కూడా తథ్యమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ లిక్కర్‌లో దోచుకున్న ప్రజల సొమ్మును తిరిగి కిక్కించి చట్టప్రకారం చర్యలకు కూటమి ప్రభుత్వం వెనుకాడదని స్పష్టంచేశారు. కల్తీ మద్యం తయారుచేసి అనేకమంది ప్రజల చావుకు కారకులైన వారిని చట్టం కఠినంగా శిక్షిస్తుందన్నారు. వాటాల పంపకంలో తేడాలు వచ్చి అక్రమాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయన్నారు. వైఎస్ఆర్ హయాంలో చేసిన అవినీతికి నాటి ఐఏఎస్ అధికారులు జైలుబాట పడితే తన యకుడు జగన్ చేసిన అవినీతి అక్రమాలకు ఐపీఎస్‌లు జైలుబాట పట్టాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. గత ప్రభుత్వ హయాంలో అన్నీ తానై ప్రతిపక్షాలను అణగదొక్కేందుకు తెరచాటు ప్రయత్నాలు చేసిన పీఎస్ఆర్ ఆంజనేయులు గతంలో తనను కూడా బెదిరించారని ఎమ్మెల్యే జూలకంటి అన్నారు. సీఐడీ అరెస్ట్ చేసిన పీఎస్ఆర్‌ను విచారిస్తే నివ్వెరపోయే అనేక విషయాలు వెలుగులోకి వస్తాయని చెప్పారు. సస్పెండైనా పోలీసుశాఖలో తన కున్న పరిచయాలతో అవినీతి అధికారులను, వైసీపీ నాయకులను కాపాడుకునేందుకు వ్యూహరచనలు చేస్తున్నాడని ఆరోపించారు. గత ప్రభుత్వ పాలనలో జరిగిన అనేక అక్రమాలకు, దౌర్జన్యాలకు తెరచాటు వ్యూహకర్త పీఎస్ఆర్ అని ఆరోపించారు.

పర్యాటకులపై దాడి హేయమైన చర్య

ప్రశాంతంగా ఉన్న జమ్మూలో ఉగ్రదాడి హేయమైన చర్యని ఎమ్మెల్యే అన్నారు. ఉగ్రదాడిని ఖండిస్తున్నామన్నారు. కొందరు వేర్పాటువాదులు భారతదేశంలో శాంతియుత వాతావరణాన్ని జీర్ణించుకోలేక కుల, మతాల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదులపై ఉక్కుపాదం మోపాలన్నారు.

వీరయ్య చౌదరి హత్యను ఖండిస్తున్నాం

ప్రకాశం జిల్లా సంతనూతలపాడు నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేత, పార్టీ అధికార ప్రతినిధి ముప్పవరపు వీరయ్యచౌదరి హత్య తనను దిగ్భ్రాంతికి గురిచేసిందని ఎమ్మెల్యే అన్నారు. ఆయన్ను దుండగులు కిరాతకంగా చంపడం దారుణమన్నారు. హంతకులను కఠినంగా శిక్షించాలన్నారు. వీరయ్యచౌదరి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పదిలో సత్తాచాటిన ఒప్పిచర్ల జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని



పావని చంద్రిక

● పావని చంద్రికకు 598 మార్కులు
● ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రథమం, రాష్ట్రస్థాయిలో ద్వితీయం

కారంపూడి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మండలంలోని ఒప్పిచర్ల జడ్పీ హైస్కూల్ విద్యార్థిని అంగడి పావని చంద్రిక సత్తా చాటింది. బుధవారం విడుదలైన పదో తరగతి ఫలితాల్లో 598/600మార్కులు సాధించి ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రథమంగా నిలవడంతోపాటు రాష్ట్ర స్థాయిలో ద్వితీయస్థానం సాధించింది. ఈ మేరకు పావని చంద్రికకు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి, ఎంఈవో రవికుమార్, హెచ్ఎం విజయలలిత, టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి పంగులూరి పుల్లయ్యలు అభినందించారు.

మాచర్ల మండలలో ప్రథమం సమీరా



సమీరా

మాచర్ల రూరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మాచర్లలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలకు చెందిన షేక్ సమీరా సత్తాచాటింది. 596/600 మార్కులతో మాచర్ల మండల ప్రథమంగా నిలిచింది.

దుర్గిలో బాలికలదే పైచేయి

దుర్గి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పది ఫలితాల్లో దుర్గి మండల పరిధిలో బాలికలదే పైచేయిగా నిలిచింది. మండలంలోని ఓబులేశునిపల్లె శ్రీకోట సైదయ్య జడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థినులు పది ఫలితాల్లో విజయదుందుభి మోగించారు. చెప్పల నవ్య 590 మార్కులతో మండల ప్రథమం సాధించగా పల్లె దివ్య 581, గుమ్మడి భవ్యశ్రీ 581 మార్కులతో ద్వితీయ స్థానం సాధించారు. 60మందికిగాను 57మంది ఉత్తీర్ణులైనట్లు ఎంఈవో బెజిమెన్, హెచ్ఎం శ్రీనివాసరావు తెలిపారు. అలాగే ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి గోపవరపు హరిభార్గవ్ 569 మార్కులతో మండల తృతీయస్థానంలో నిలిచారు.



నవ్య

వెల్దుర్తి మండల ప్రథమం శివమణి

వెల్దుర్తి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మండలంలోని శిరిగిరిపాడు జడ్పీ హైస్కూల్‌కు చెందిన జి శివమణి 580 మార్కులతో మండల ప్రథమంగా నిలిచింది. కండ్లకుంట జడ్పీహెచ్ఎస్‌కు చెందిన జయశ్రీ 563 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచింది. మండలంలో 339మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 220మంది ఉత్తీర్ణులయ్యారు. 65శాతం ఉత్తీర్ణత సాధించారు.

● రెంటచింతల, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పది ఫలితాలలో ప్రభుత్వపాఠశాలల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచారు. ఏపీ గిరిజన సంక్షేమ పాఠశాలకు చెందిన సంపత్‌నాయక్‌కు 573మార్కులు, ఏపీ మోడల్‌స్కూల్ విద్యార్థిని పి.హారికకు 570 మార్కులు సాధించినట్లు ఎంఈవో 2 శివనాగేశ్వరరావు చెప్పారు. ప్రభుత్వపాఠశాలల్లో 72.79 ఉత్తీర్ణత శాతం నమోదైందన్నారు.

గురజాలలో మోడల్ స్కూల్ విద్యార్థిని..

గురజాలటౌన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పది పరీక్షా ఫలితాల్లో గురజాల పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థిని కె.విద్యశ్రీ 583 మార్కులతో మండల ప్రథమంగా నిలిచింది. ప్రభుత్వోన్నత పాఠశాల విద్యార్థిని శృతిలయ 568 మార్కులతో రెండో స్థానంలో నిలిచింది. మొత్తం 427మంది పరీక్షలకు 306మంది ఉత్తీర్ణత సాధించారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ



జి.రాధిక

నకరికల్లు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో కుంకలగుంట జెడ్పీ హైస్కూల్‌కు చెందిన గంజనబోయిన రాధిక 590 మార్కులతో నకరికల్లు మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది. చల్లగుండ్ల రాజీవ్‌గాంధీ స్మారక వికలాంగుల ఉన్నత పాఠశాల నూరు శాతం ఉత్తీర్ణత సాధించింది. ఆ తరువాత నకరికల్లు జెడ్పీ హైస్కూల్ 87శాతం, దేచవరం మోడల్ స్కూల్ 85శాతం, జెడ్పీ హైస్కూల్ కుంకులగుంట 82శాతంతో ఉత్తమ ఫలితాలు సాధించాయి. ఈ మూడు పాఠశాలలు 500కు పైగా మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించాయి.

● సత్తెనపల్లి రూరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల, గురుకుల పాఠశాలల విద్యార్థులు బుధవారం వెలువడిన 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో సత్తాచాటారు. రామకృష్ణాపురం వద్దగల బాలుర గురుకుల పాఠశాల విద్యార్థి ఎం సాయి శ్రీచరణ్ 587మార్కులు, బాలికల గురుకుల పాఠశాల విద్యార్థిని 578, బృగుబండ జెడ్పీహైస్కూల్ విద్యార్థి కుసుమ వెంకటహరిప్రియ 586, కట్టమూరు హైస్కూల్ విద్యార్థి వీ పవన్ 576, నందిగామ హైస్కూల్ విద్యార్థిని పీ ప్రవీత 574, కొమెరపూడి హైస్కూల్ విద్యార్థిని ఎం శ్రీరేవతి 570, పణిదం జెడ్పీహైస్కూల్ విద్యార్థి మోహన మహిత 567, వెన్నాదేవి జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని దేవిశ్రీ సాహిత 565, అబ్బూరు హైస్కూల్ విద్యార్థిని జీ శ్రీహర్షం 564, రెంటపాళ్ళ హైస్కూల్ విద్యార్థిని టీ హేమలత 556, ధూళిపాళ్ళ హైస్కూల్ విద్యార్థిని ఎం నవ్య 552, లక్కరాజుగార్లపాడు హైస్కూల్ విద్యార్థిని ఎం యామిని 549, పెద మక్కెన హైస్కూల్ విద్యార్థిని పీ యోగహర్షిత 545, గుడిపూడి హైస్కూల్ విద్యార్థి వైఎస్ లిఖిత్‌రెడ్డి 522 మార్కులు సాధించి ఆయా పాఠశాలల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు.

మోర్జంపాడు హైస్కూల్‌కు మండలం ప్రథమం

మాచవరం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): గత మార్చిలో జరిగిన 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో మండలంలోని మోర్జంపాడు జడ్పీ హైస్కూల్ విద్యార్థిని మూలగుండ్ల సాక్షితారెడ్డి 589మార్కు లు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే వేమవరం జడ్పీ హైస్కూల్ విద్యార్థిని గంగవరపు ప్రణతి 582, మాచవరం జడ్పీ హైస్కూల్ విద్యార్థి బద్దిశెట్టి గంగహర్షిత 581 మార్కులు సాధించి రెండు, మూడు స్థానాల్లో నిలిచినట్లు మండల విద్యాశాఖ అధికారులు అట్లూరి శ్రీనివాసరెడ్డి, డీ శ్రీధర్ బుధవారం తెలిపారు. మండలం లో 74శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వారు తెలిపారు.

దాచేపల్లి మండలంలో 81.3 శాతం

దాచేపల్లి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): దాచేపల్లి మండలంలో 915మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 744మంది పాసయ్యారు. బాలికలు ఉత్తీర్ణత శాతం 83.1, బాలురకు 79.4శాతంగా నమోదైంది. ఏపీ మోడల్ స్కూల్ పాఠశాల విద్యార్థి పల్లి వెంకటశ్రీరామ్ 561 మార్కులు, రెండోస్థానంలో నీరజ, షేక్ హార్స 560, కస్తూర్బా పాఠశాల విద్యార్థి బీ కావ్యబాయి 541, రెండోస్థానంలో వై త్రిష 533, మహాత్మాజ్యోతిరావు పూలే పాఠశాల విద్యార్థులు చిరు 559, ద్వితీయస్థానంలో ఎస్ గంగిరాజు 556, రామాపురం ఉన్నత పాఠశాల ఎన్ యశ్మిత 475, ద్వితీయస్థానంలో ఆర్.అలేఖ్య 472, పెదగార్లపాడు ఉన్నత పాఠశాల కటికాల మహేశ్వరి 576, ద్వితీయస్థానంలో తోట అక్షయ 552మార్కులు, దాచేపల్లి ఉన్నత పాఠశాల జీ నికిల్‌రాజు 572, కే చరణ్ తేజ 569, తంగెడ ఉన్నత పాఠశాల టీ దత్తాత్రేయుడు 549, ఎస్‌కే సల్మా 525, ముత్యాలంపాడు ఉన్నత పాఠశాల రామ్‌సాయి హర్షరెడ్డి 548, ఎం అక్షయ 541, గామాలపాడు ఉన్నత పాఠశాల వై మాధురి 553, పోలే శరణ్య 552 మార్కులు సాధించారు.

● పిడుగురాళ్ల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పది ఫలితాలలో మండలంలోని తుమ్మలచెరువు జడ్‌పి పాఠశాలలో 558 మార్కులతో గాయత్రి, బ్రాహ్మణపల్లి జడ్‌పి పాఠశాలలో 583 మార్కులతో హర్షవర్ధన్‌రెడ్డి, పిడుగురాళ్ల జడ్‌పి పాఠశాలలో వై పూర్ణ వెంకటశ్రీనివాసరావు 578, లెనిన్‌నగర్ జడ్పీ పాఠశాలలో 544 మార్కులతో షేక్ సైదుల్లా, జానపాడు హైస్కూల్‌లో కె లక్ష్మీ ప్రసన్న 579, కరాలపాడు హైస్కూల్‌లో ఎం స్రవంతి 557, జూలకల్లు జడ్పీ హైస్కూల్‌లో ఎస్ లక్ష్మీరేఖ 574, పిడుగురాళ్ల కేజీబీ ఈవీలో కె.కీర్తి 535, ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ స్కూల్‌లో ఆర్ ఐశ్వర్యబాయి 558 సాధించినట్లు ఎంఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

క్రోసూరు మండలంలో 93 శాతం ఉత్తీర్ణత

క్రోసూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షాఫలితాల్లో క్రోసూరు మండలంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. 88 తాళ్ళూరు జడ్పీహైస్కూల్‌కు చెందిన షేక్‌షాహిద్ 587 మార్కులతో ప్రథమస్థానంలో నిలిచారు. బయ్యవరం హైస్కూల్‌కు చెందిన పీ గాయత్రి 586తో ద్వితీయ, హసానాబాద్ జడ్పీ హైస్కూల్‌కు చెందిన షేక్ ఆస్మ 584 మార్కులతో మూడోస్థానంలో నిలిచారు.

మండలంలో 93 శాతం..

అచ్చంపేట, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలో 10వ తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. అచ్చంపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి సందీప్ 578 మార్కులు సాధించారు.

అమరావతిలో 91...

అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పదిలో మండలంలో 573మంది విద్యార్థులు రాయగా 520 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ శివబాబు తెలిపారు. ఆరు ప్రభుత్వపాఠశాలలో 86శాతం ఉత్తీర్ణత సాధించారు. మునగోడు జడ్పీ హైస్కూల్ విద్యార్థిని షేక్ షహీరాబాను 581మార్కులతో ప్రథమ స్థానం, ఎస్ఆర్‌కే హైస్కూల్ విద్యార్థి బి.రమ్య 567 మార్కులతో ద్వితీయస్థానంలో నిలిచింది.

పదిలో ఉత్తమ ఫలితాలు...

ముప్పాళ్ళ ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ముప్పాళ్ళ మండలంలో బుధవారం విడుదల చేసిన 10వ తరగతి పరీక్షా ఫలితాలలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారు. మండలంలో మొత్తం 340మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 244మంది ఉత్తీర్ణత సాధించారు. ముప్పాళ్ళ హైస్కూల్‌కు చెంది ఎ.యశశ్విని 579 మార్కులతో మొదటిస్థానం, ఎం.సాహితీకృష్ణ 576తో రెండోస్థానం, కె.మానస హిమకార్తిక 568 మార్కులతో మూడోస్థానం సాధించారు.

● రాజుపాలెం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్ష ఫలితాలలో ఆకులగణపవరంలో జడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎం.హాసిని 584 మార్కులతో మండలంలో ప్రథమ స్థానం, ఎం.హరిణి 582తో ద్వితీయస్థానంలో నిలిచారు. మండలంలో ప్రభుత్వ పాఠశాలలు 83శాతం ఉత్తీర్ణత సాధించాయని ఎంఈవోలు మల్లికార్జున శర్మ, నరసింహరావులు తెలిపారు.

● బెల్లంకొండ, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలో 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో 85శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో రాజకుమారి తెలిపారు. మొత్తం 248 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 210మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. బెల్లంకొండ కస్తూర్బా పాఠశాలలో బీ ప్రసన్న 580 మార్కులతో మండలంలో ప్రథమ స్థానం, పీ మహాలక్ష్మి 552తో ద్వితీయస్థానం సాధించినట్లు తెలిపారు.

ఉగ్రదాడిని నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ

రెంటచింతలలో బీజేపీ నేతల నిరసన

రెంటచింతల, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కాశ్మీర్‌లో ఉగ్రవాదులు పర్యాటకులను కాల్చి చంపడంపై బుధవారం రెంటచింతలలో బీజేపీ నేతలు కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏలూరి శశికుమార్, మాజీ మండల అధ్యక్షుడు పుల్లారెడ్డి, జిల్లా యువమోర్చ అధ్యక్షుడు మక్కెన పూర్ణచంద్రరావు, కోటేశ్వరరావు, జనసేన నేత మహేష్, జక్కా రామయ్య తదితరులు పాల్గొన్నారు.

అమరావతిలో..

అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ జరిగింది. కోలా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో బీజేపీ నాయకులు మద్ది ధాత్రినారాయణ, పుల్లారావు తదితరులు పాల్గొని దాడిలో మృతిచెందినవారికి నివాళులర్పించారు. ఉగ్రదాడికి కారకులైనవారిని ఉరితీయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం గాంధీబొమ్మ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు.

సత్తెనపల్లిలో న్యాయవాదుల నిరసన

సత్తెనపల్లి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కాశ్మీర్‌లో ఉగ్రదాడిని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగూరి అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ఖండించారు. బుధవారం కోర్టు ఆవరణలో కాశ్మీర్ ఉగ్రదాడిలో అశువులు బాసిన పౌరుల ఆత్మకు శాంతి కలగాలని వారు మౌనం పాటించారు. ఉగ్రవాదులు నశించాలి.. ప్రపంచశాంతి వర్ధిల్లాలి అంటూ న్యాయవాదులు నినాదాలు చేశారు. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలన్నారు.



సత్తెనపల్లి కోర్టులో నిరసన తెలియ జేస్తున్న న్యాయవాదులు



రెంటచింతలలో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నేతలు



నకరికల్లు పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ కంచి శ్రీనివాసరావు

రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలి

● ఎస్పీ కంచి శ్రీనివాసరావు

నకరికల్లు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లపై నిరంతరం ప్రత్యేక నిఘా ఏర్పాటుచేయాలని ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాలు జారీ చేశారు. బుధవారం రాత్రి ఆయన నకరికల్లు పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేశారు. అక్రమ మద్యం, గంజాయి రవాణా, నిషేధిత మత్తుపదార్థాల రవాణాను నివారించేలా దృష్టి సారించాలన్నారు. సచివాలయాల్లో మహిళా పోలీసుల సహకారంతో మహిళలపై జరుగుతున్న నేరాలను అరికట్టడంలో శ్రద్ధ చూపాలన్నారు. సైబర్ నేరాలు, లోన్‌యాప్‌ల మోసాలు, పోక్సో నేరాలపై అవగాహన పెంపొందించాలన్నారు. విచారణలో ఉన్న కేసుల పురోగతిని, దర్యాప్తు తీరుపై విచారించి బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని సూచించారు. వివిధ కేసులకు సంబంధించి రికార్డులను తనిఖీ చేశారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులను వెంటనే పరిష్కరించాలన్నారు. పోలీసుస్టేషన్ పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎస్ఐ చల్లా సురేష్‌ను కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు.

రాజుపాలెం పోలీస్‌స్టేషన్‌లో తనిఖీ

రాజుపాలెం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రాజుపాలెం పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ శ్రీనివాసరావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రాపర్టీ నేరాలను నియంత్రణకు కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.



కార్డెన్ చర్చిలో స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

సత్తెనపల్లి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రంగాకాలనీలో డీఎస్పీ హనుమంతరావు ఆధ్వర్యంలో వందమంది పోలీసులు బుధవారం డ్రోన్ సాయంతో కార్డెన్ చర్చి నిర్వహించారు. ఎస్పీ కే శ్రీనివాసరావు ఆదేశాల మేరకు నిర్వహించిన కార్డెన్ చర్చిలో తరచూ గొడవలకు పాల్పడుతున్న కొంతమంది రౌడీషీటర్లను, సమస్యలు సృష్టించేవారి గృహాలను పోలీసులు తనిఖీ చేశారు. రౌడీషీటర్లపై నిరంతరం నిఘా ఉంటుందని డీఎస్పీ హెచ్చరించారు. గంజాయి విక్రయాలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేదన్నారు. సరైన ధ్రువపత్రాలు లేని 30 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు.



స్వామివార్లకు వెండి పూజాసామాగ్రి తెస్తున్న ఎంఎల్ఏ ప్రవీణ్, భాష్యం రామకృష్ణ తదితరులు

కన్నుల పండువగా రామాలయ విగ్రహప్రతిష్ఠ

అమరావతి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): భాష్యం విద్యాసంస్థల అధినేత భాష్యం రామకృష్ణ సొంతగ్రామం మండలంలోని ఎనికపాడులో శ్రీసీతారామ లక్ష్మణుల విగ్రహప్రతిష్ఠ, శివలింగ ప్రతిష్ఠ, ఆలయ శిఖరాల ప్రతిష్ఠతోపాటు నవగ్రహ, జీవధ్వజ స్తంభ, ద్వారపాలకుల ప్రతిష్ఠలు బుధవారం కన్నుల పండువగా జరిగాయి. రుత్వికులు ప్రతేక పూజా క్రతువులు నిర్వహించారు. మధ్యాహ్నం పూర్ణాహుతితో ప్రతిష్ఠమహోత్సవం ముగిసింది. భాష్యం రామకృష్ణతో పాటు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, భాష్యం హనుమంతరావు ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.

షార్ట్‌సర్క్యూట్‌తో వ్యవసాయ పనిముట్లు దగ్ధం

● సుమారు రూ.2లక్షల ఆస్తినష్టం

మాచవరం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): షార్ట్‌సర్క్యూట్‌తో వ్యవసాయ పనిముట్లు దగ్ధమైన సంఘటన మండలంలోని కొత్తపాలెం గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన పొన్నం నరసింహారావు గృహంలో షార్ట్ సర్క్యూట్‌తో 70 పీవీసీ పైపులు, తైవాన్ స్ప్రేయరు, బ్యాటరీ హెడ్ స్ప్రేయరు, టీవీఎస్ ఎక్సెల్, మిర్చిటిక్కీలు తదితర వ్యవసాయ పనిముట్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఇరుగుపొరుగువారు చూసి మంటలను ఆర్పేందుకు ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. విషయాన్ని పిడుగురాళ్ళ అగ్నిమాపక శాఖ అధికారులు వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. సుమారు రూ.2 లక్షల ఆస్థి నష్టమైనట్లు బాధితుడు నరసింహారావు తెలిపారు. విషయం తెలుసుకున్న వీఆర్వో సంఘటనా స్థలానికి చేరుకొని దగ్ధమైన వస్తువుల వివరాలు నమోదు చేసుకున్నారు.

దుకాణంలో చోరీ - వెండి వస్తువులు, నగదు అపహరణ

రెంటచింతల, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలువాయిజంక్షన్ పఠాన్ జానీ బాష వెండి దుకాణంలో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. చోరీలో వెండివస్తువులు, రెండు జతల పట్టీలు, రూ.25వేల నగదు అపహరణకు గురయ్యాయి. షట్టర్ తాళాలు పగులగొట్టి ఈ చోరీకి పాల్పడ్డారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగార్జున చెప్పారు.

జెండా అవనతం

సత్తెనపల్లి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కాశ్మీర్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని నిరశిస్తూ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బొర్రా వెంకటఅప్పారావు సూచనలతో బుధవారం ధూళిపాళ్ళ జనసేన పార్టీ కార్యాలయం వద్ద ఆ పార్టీ మండల అధ్యక్షుడు నాదెండ్ల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జెండాను అవనతం చేశారు. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

సూరీడు.. సుర్రు



ఎండ దాటికి గొడుగుతో..



రిక్షా కార్మికుడి జీవన పోరాటం




ఫ్లెక్సీ కప్పుకున్న వృద్ధుడు

ఒకవైపు పైన తలమాడుతోంది.. మరోవైపు కింద భూమి పెనంలా మాడుతుంది.... అయినా కష్టజీవులు జీవన పోరాటం సాగిస్తూనే ఉన్నారు...... కొన్నిచోట్ల విద్యార్థులు చెప్పులు లేక కాలుతున్న ఎండలోనే కాళ్లు బొబ్బలెక్కేల పరిగెడుతూ ఇంటి బాట పడుతున్న వైనం... జగనన్న ఇచ్చిన విద్యా కానుకలో బూట్లు ఏమయ్యాయో తెలియదు పరిస్థితి.. ఇదీ బుధవారం గుంటూరులో కనిపించింది.

-గుంటూరు (ఆంధ్రజ్యోతి)







కాళ్లకు చెప్పులు లేక ఎండ వేడిమికి విద్యార్థుల ఇక్కట్లు

ఒక్కొక్కటిగా.. రైళ్లన్నీ చర్లపల్లికి

● సికింద్రాబాద్ స్టేషన్ పునరాభివృద్ధి పనులతో రైల్వే శాఖ నిర్ణయం ● ఇప్పటికే ఏడు రైళ్ల టెర్మినల్స్ మార్పు ● మరికొద్ది రోజుల్లో ఇంకొన్ని రైళ్లను మార్చే అవకాశం

గుంటూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునర్ నిర్మాణ పనులు కారణంగా గుంటూరు నుంచి వెళ్లే చాలా రైళ్లను చర్లపల్లి స్టేషన్‌లోనే రైల్వే శాఖ ప్రయాణాన్ని నిలిపేస్తున్నది. లింగంపల్లి వెళ్లాల్సిన రైళ్లలో కొన్నింటిని చర్లపల్లి నుంచి సనత్‌నగర్‌కు మళ్లించి ఆ తర్వాత లింగంపల్లికి చేరుస్తున్నది. దీంతో ఎన్నో ఏళ్లుగా ఇక్కడి ప్రయాణికులు సికింద్రాబాద్/హైదరాబాద్ రైల్వేస్టేషన్లలో దిగి వెళ్లేవారు ఇప్పుడు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఒంటరిగా వెళ్లే యువతులు, మహిళలు చర్లపల్లిలో దిగేసి అక్కడి నుంచి రూంలు/హాస్టల్స్‌కు చేరుకోవడానికి తీవ్ర అసౌకర్యానికి గురౌతున్నారు. రైల్వే శాఖ చర్లపల్లి టెర్మినల్‌కి రైళ్లను మారుస్తుండటం తాత్కాలికమే అని చెబుతున్నప్పటికీ రాబోయే రోజుల్లో పెరిగే రద్దీ నేపథ్యంలో దానినే శాశ్వతం చేసే అవకాశం లేకపోలేదు.

వారంలో రెండు రోజులు గుంటూరు మీదగా నాగర్‌సోల్ వెళ్లే బైవీక్లీ ఎక్స్‌ప్రెస్‌ని ఇప్పటికే చర్లపల్లికి మార్చేశారు. అలానే చెన్నై, జన్మభూమి, రేపల్లె, శిల్పార్ ఎక్స్‌ప్రెస్‌లతో పాటు విల్లుపురం, శ్రీకాకుళం రోడ్డు, కన్యాకుమారి తదితర స్పెషల్స్‌ని కూడా చర్లపల్లికి మార్చేసింది. త్వరలో మరికొన్ని రైళ్ల టెర్మినల్స్‌ని కూడా చర్లపల్లికి మార్చే అవకాశం ఉందని రైల్వేవర్గాల ద్వారా తెలిసింది. చర్లపల్లి రైల్వేస్టేషన్ సికింద్రాబాద్‌కు దాదాపుగా 15 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. అక్కడి నుంచి సిటీ బస్సు సౌకర్యాలు కూడా అంతంత మాత్రమే. ఒక రైలులో దాదాపుగా 1500 మందికి పైగా ప్రయాణికులు అక్కడ దిగుతుంటారు. దీంతో అంతమంది సిటీ బస్సుల్లో గమ్యస్థానాలకు వెళ్లాలంటే చాలా కష్టం. చెన్నై ఎక్స్‌ప్రెస్ వేకువజామున 5.10 గంటలకల్లా చర్లపల్లి చేరుకొంటుంది. అప్పటి నుంచి సిటీ బస్సులు కదలాలంటే కనీసం గంటకు పైగా అక్కడ నిరీక్షించాల్సి వస్తున్నదని ప్రయాణికులు వాపోతున్నారు. ఒకవేళ సికింద్రాబాద్‌లో వీలు పడకపోతే గతంలో వలే హైదరాబాద్(నాంపల్లి)లో టెర్మినేట్ చేస్తే అక్కడి నుంచి మెట్రో/సిటీ బస్సుల్లో గమ్యస్థానాలకు చేరుకోవచ్చని చెబుతున్నారు.

ప్రస్తుతానికి లింగంపల్లి వెళ్లే ఇంటర్‌సిటీ, వందేభారత్, పల్నాడు, విశాఖ, ఫలక్‌నుమా, శబరి, ఎల్‌టీటీ, డెల్టా, నరసపూర్, నారాయణాద్రి, వయా వరంగల్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లు మాత్రమే సికింద్రాబాద్ వెళుతున్నాయి. వీటిల్లో కూడా కొన్నింటిని కొద్ది రోజుల్లోనే చర్లపల్లికి మార్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. అప్పుడు ఇక్కడి నుంచి సికింద్రాబాద్‌కు వెళుతున్న ప్రయాణికులకు కష్టాలు మరింత పెరుగుతాయి. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా ఎంఎంటీఎస్ రైళ్లను నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.



ప్రధాని పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు

● సభా వేదిక వద్దకు చేరుకునేందుకు 8 రోడ్ల గుర్తింపు ● రూ. లక్ష కోట్ల విలువైన పనులను పీఎం మోదీ ప్రారంభిస్తారన్న మంత్రి నారాయణ ● రోడ్ల పనులు అత్యవసరంగా పూర్తి చేయాలని ఆదేశం

తుళ్లూరు, గుంటూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా అమరావతి పనులను పునః ప్రారంభించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఈ నేపథ్యంలో వచ్చేనెల రెండో తేదీన ప్రధాని హాజరయ్యే సభా ప్రాంగణానికి సంబంధించిన పనులు, సభా ప్రాంగణానికి చేరుకునే రహదారుల పనులు కొద్దిరోజులుగా నిర్విరామంగా సాగుతున్నాయి. ప్రధాని పర్యటన విజయవంతం చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. ఇప్పటికే పలు పనులు తుది దశకు చేరుకున్నాయి.

గతంలో రూ. 5వేల కోట్ల వ్యయం

గతంలో ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగానే రాజధాని అమరావతి శంకుస్థాపన జరిగింది. 2014- 19 మధ్య అమరావతి నిర్మాణానికి ఐదువేల కోట్లకుపైగా అప్పటి టీడీపీ ప్రభుత్వం ఖర్చు చేసింది. అనేక భవనాలు, రోడ్లు నిర్మించింది. వాటిలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఆలిండియా సర్వీస్ ఉద్యోగుల భవనాల పనులు 80 శాతానికిపైగా పూర్తయ్యాయి. అనేక రహదారుల నిర్మాణం కూడా జరిగింది. కానీ గత ప్రభుత్వం రాజధాని విషయంలో మూడు ముక్కలాటాడి, ఎక్కడా రాజధాని లేకుండా నిర్వీర్యం చేసింది. అమరావతి ప్రాంతాన్ని అడవిలా మార్చేసింది. కూటమి ప్రభుత్వం రాగానే సీఎం చంద్రబాబు అమరావతిలో పర్యటించి వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. ఆ నేపథ్యంలోనే రూ.64 వేల కోట్లతో టెండర్లు పిలవడానికి సీఆర్డీఏ అథారిటీలో నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకూ రూ.41 వేల కోట్ల పనులకు టెండర్లు పూర్తయి పనులు కూడా ప్రారంభమయ్యాయి. ప్రధాని చేతుల మీదుగా ఈ పనులను లాంఛనంగా పునఃప్రారంభించాలని సీఎం చంద్రబాబు నిర్ణయించడంతో అందుకనుగుణంగా అమరావతిలో ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి.



ప్రధాని సభ వద్ద చదును చేస్తున్న భారీ యంత్రాలు



రెడీ చేస్తున్న వెస్ట్‌బైపాస్

● 1.1 కి.మీ మేర రోడ్ షో.. 5లక్షల మందితో సభ

వచ్చే నెల రెండో తేదీన ప్రధాని మోదీ అమరాతికి రానున్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు గన్నవరం ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి అమరావతికి వచ్చి 1.1 కిలోమీటర్ల మేర రోడ్ షోలో పాల్గొని బహిరంగ సభ వేదిక వద్దకు చేరుకుంటారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు సభ జరుగుతుంది. సుమారు 5 లక్షల మంది ప్రజలు సభకు వస్తారని అంచనా వేస్తున్నామని, అందుకు తగినట్లుగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ- 11, ఈ- 13, ఈ- 15 రోడ్లతో పాటు సీడ్ యాక్సిస్ రోడ్డు నుంచి రాకపోకలు జరుగుతాయి. ఇప్పటికే పోలీస్ శాఖ రోడ్లు పరిశీలించి గుంతలు పూడ్చాలని కోరింది. ప్రధాని సభకు వచ్చే వాహనాల కోసం మొత్తం 11 పార్కింగ్ ప్రాంతాలు ఏర్పాటుచేస్తున్నారు. మొ త్తం 8 రోడ్ల ద్వారా సభా వేదిక వద్దకు చేరుకునేలా రవాణా ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళగిరి నుంచి రెండు రోడ్లు, తాడేపల్లి నుంచి ఒకటి, వెస్ట్ బైపాస్ నుంచి ఒకటి, ప్రకాశం బ్యారేజి నుంచి రెండు,

తాడికొండ నుంచి ఒకటి, హరిశ్చంద్రాపురం నుంచి ఒక రోడ్డు ద్వారా సభా వేదిక వద్దకు చేరుకోవచ్చు. వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ట్రాఫిక్ జామ్ కు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పోలీస్ శాఖ సూచనల మేరకు రెండు రోజుల్లోగా రోడ్లన్ని సరిచేయాలని సీఆర్డీఏ అధికారులను మంత్రి నారాయణ ఆదేశించారు.

5 లక్షల మందికి తగ్గట్లుగా ఏర్పాట్లు: మంత్రి నారాయణ

అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి 5 లక్షలమంది హాజరవుతున్నారని అంచనా వేస్తున్నామని, అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి నారాయణ తెలిపారు. రాజధాని అమరావతిలో వచ్చే నెల రెండో తేదీన జరగనున్న ప్రధాని పర్యటన, సభ ఏర్పాట్లను రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి పొంగూరి నారా యణ బుధవారం పరిశీలించారు. గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌తో కలిసి రెండుగంట లపాటు రాజధానిలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించిన ఆయన ప్రధాని సభ నేపథ్యంలో జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొనే సభావేదిక వద్దకు వెళ్లేం దుకు అవసరమైన రోడ్లను పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. మే రెండో తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ప్రధాని గన్నవరం ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి అమరావతికి వచ్చి 1.1 కిలోమీటర్ల మేర రోడ్ షోలో పాల్గొని బహిరంగ సభ వేదిక వద్దకు చేరుకుంటారని, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకూ సభలో పాల్గొంటారని తెలిపారు. ఈ సభకు సుమారు 5 లక్షల మంది ప్రజలు వస్తారని అంచనా వేస్తున్నామని, అందుకు తగినట్లుగా ఏర్పాట్లు జరుగుతున్నాయని వివరించారు. సభ నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. ప్రజల రాకపోకలకు మొత్తం 8 రోడ్లను, 11 పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేశామని తెలిపారు.

గ్రామాలను చెత్త రహితంగా మారుద్దాం

● స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్



చేబ్రోలులోని సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ వద్ద అధికారులతో కొమ్మారెడ్డి పట్టాభిరామ్

పొన్నూరుటౌన్(చేబ్రోలు) ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): గ్రామాలను చెత్త రహితంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. చేబ్రోలులోని సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్ ప్లాంట్‌ను బుధవారం కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తనిఖీ చేశారు. ప్లాంట్‌లో ఉన్న వివరాలు,యాప్‌లో నమోదు చేసిన వివరాలకు వ్యత్యాసం ఉండడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంపద సృష్టి కేంద్రాల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పట్టాభిరామ్ మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యంగా కారణంగా రాష్ట్రంలో 85 లక్షల టన్నుల చెత్త పేరుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పట్టణ ప్రాంతాలలో చెత్తను తొలగించే పనులు చేపట్టినట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాలలో డ్రోన్ సర్వేల ద్వారా చెత్తను తొలగించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు వివరించారు. చెత్త సెగ్రిగేషన్ విషయంలో ఖచ్చిత మైన డేటాను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేసేలా కృషి చేస్తామన్నారు. గ్రామ పంచాయతీలు సైతం ఇంటింటి నుంచి చెత్తను సేకరించి ప్రాసెస్ చేస్తున్నట్లు చెప్పారు. పీఆర్1 యాప్ ద్వారా ప్రతి గ్రామ పంచాయతీలో సందప సృష్టి కేంద్రాల నిర్వహణను పర్యవేక్షణ చేస్తున్నట్లు చెప్పారు. గురువారం జరగబోయే జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పాల్గొంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీపీవో సాయికుమార్, ఎంపీడీవో ఉమాదేవి, ఈవోపీఆర్డీ ఉషారాణి, టీడీపీ మండల అధ్యక్షుడు షైలా రామరాజు, జనసేన అధ్యక్షుడు చందు శ్రీరాములు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మండు వేసవిలో ఊరిస్తున్న తాటి ముంజలు

చిలకలూరిపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేటలో తాటి ముంజల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. బాపట్ల జిల్లా కోలలపూడి, బొల్లాపల్లి ప్రాంతాల నుంచి ఆటోలలో తీసుకువచ్చి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విక్రయిస్తున్నారు. ప్రధానంగా స్థానిక నరసరావుపేట సెంటర్లో డివైడర్లపై వీటి విక్రయాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఒక్కొక్క తాటికాయలో మూడు ముంజలు ఉంటాయి. తాటికాయ ధర రూ. 20 వరకు పలుకుతున్నది. తాటికాయల నుంచి ముంజలను తీశాక వచ్చే వ్యర్థాలను ఆటోలలో తిరిగి తీసుకువెళుతున్నారు. వాటిని గేదెలు, ఎద్దులు ఎంతో ఇష్టంగా తింటాయని ముంజల విక్రయిదారులు చెబుతున్నారు.

తాటి ముంజలతో ఎన్నో ప్రయోజనాలు

ఎటువంటి రసాయనాల ప్రభావం లేకుండా సహజ సిద్ధంగా లభించే తాటికాయలలోని ముంజలు పోషకాల పరంగా, ఆరోగ్య పరంగా ఎంతో మంచి ఆహారం. వేసవిలో తాటి ముంజలు తింటే శరీర ఉష్ణోగ్రతను తగ్గించి చల్లదనాన్ని ఇస్తాయి. ముంజలలో నీటి శాతం ఎక్కువగా ఉండటం వల్ల శరీరానికి తక్షణ శక్తినివ్వడమే కాకుండా శరీరం డీహైడ్రేషన్ అవ్వకుండా ఉంటుంది. ఫైబర్ అధికంగా ఉన్న కారణంగా ఇవి జీర్ణక్రియకు కూడా సహాయపడతాయి. మలబద్ధకం వంటి సమస్యలను తగ్గిస్తా యి. రోగనిరోధక శక్తిని పెంచుతాయి. వీటిలో పొటాషియం, కాల్షియం, ఐరన్ వంటి ఖనిజాలతో పా టు బీ, సీ విటమిన్లు ఉంటాయి. కాకపోతే ఒకే రోజు, ఒకే విడత వీటిని ఎక్కువ మొత్తంలో తినకూ డదు. రోజుకు100 గ్రాముల వరకు తినొచ్చు.100 గ్రాముల ముంజల్లో 43 కేలరీలు లభిస్తాయి.11 గ్రాముల కార్బోహైడ్రేట్లు అందుతాయి. ఇక పిల్లలకు పాలిచ్చే తల్లులు ముంజలను తినడం మంచిది. ఇవి తల్లిపాలను వృద్ధి చేస్తాయి. వేసవిలో తాటి ముంజలు తినడం ఆరోగ్యానికి అన్ని విధాలా మంచిది.



మొక్కజొన్న పేరుతో మెక్కేస్తున్నారు

(5వ పేజీ తరువాయి)

వారు కప్పం కట్టాల్సిన పరిస్థితి. గత వైసీపీ ప్రభుత్వ కాలంలో ఒక్కో ర్యాక్‌కు రూ. 2 లక్షల వరకు వసూలు చేస్తూ వచ్చారు. దీని వెనుక అప్పట్లో మార్కెటింగ్ శాఖలో పనిచేస్తున్న ఇద్దరు కిందిస్థాయి ఉద్యోగులు కూడా ఉన్నారనే ప్రచారం ఉంది. వారిని అడ్డుపెట్టుకుని ఒకే వ్యక్తి ర్యాక్‌లు బుక్ చేయటం, ఒకవేళ అతనితో సంబంధం లేకున్నా వ్యాపారులే బుక్ చేసుకున్నా, దానిలో సరకు లోడ్ చేయాలన్నా, ర్యాక్ కదలాలన్నా కప్పం కట్టాల్సిందేననే హుకుం జారీ చేశారు. దీనికి అప్పటి వైసీపీ నేతలు కూడా అండగా నిలిచారనే ప్రచారం ఉంది. అయితే ఇప్పుడు ఆ కప్పం కంపు కూటమి నేతలకూ పులుముతున్నారు. అడ్వాన్స్‌డ్ ర్యాక్‌ల బుకింగ్‌తో అక్రమ దందాకు రంగంలోకి దిగిన కొందరు వ్యాపారులు కూటమి నేతల పేర్లుచెప్పి మరీ బహిరంగంగానే వసూళ్లకు దిగుతున్నారు. తెలుగుదేశం, జనసేన, నేతల పేర్లు చెప్పి వసూళ్లకు తరలీశారు. ఇవన్నీ మాకు కాదని, నేతలకు కట్టాల్సిందేనంటూ బహిరంగంగానే చెప్పటం కొసమెరుపు.

ర్యాక్‌ల ద్వారా రూ. కోటిన్నర లక్ష్యంగా...

పంట పండించలేదు... పండించిన రైతుల దగ్గర నుంచి డబ్బుపెట్టి సరకు కొననూలేదు. కేవలం అధికార పార్టీల అండే వారికి దందాకు ఊతంగా మారింది. వైసీపీ ప్రభుత్వ కాలంలో కప్పం వ్యవహారం కంపు కొట్టినా, అధికార పార్టీ నేతలు సంపాదనే లక్ష్యంగా రూ. కోటిన్నర కోసం టార్గెట్ పెట్టుకుని వసూళ్ల దందాకు దిగారనేది వ్యాపారుల ఆరోపణ. ఒక్క తెనాలి నుంచే మొక్కజొన్న, జొన్న లోడుతో ఏటా ఏప్రిల్ నుంచి జూన్ వరకు 35 నుంచి 40 వరకు ర్యాక్‌లు ఇతర రాష్ట్రాలకు వెళ్లటం పరిపాటి. కేవలం దీనిపైనే రూ. కోటిన్నర లక్ష్యంగా పెట్టుకున్నారో! లేక గత వైసీపీ ప్రభుత్వంలో వసూళ్ల రాయుళ్లను మంచివాళ్లను చేద్దామనుకున్నారో కానీ, ఈ ఏడాది ఒక్కో ర్యాక్‌కు తమ సొంత ఎగుమతి సుంకాన్ని రూ. 3 నుంచి రూ. 4లక్షల వరకు పెంచేశారు. ఒకే ఏడాది అంత మొత్తంలో అనధికార వసూళ్ల పెంచేయటంతో వ్యాపారుల్లో నిరసన వ్యక్తమయింది. అదేమని ఎవరైనా అడిగినా ఇవన్నీ మాకు కాదని, పార్టీ నేతలకు పంపాలంటూ ఏలూరు, తెనాలి, బాపట్ల జిల్లాల నుంచి వచ్చిన వ్యాపారులు, వసూలు రాయుళ్ల చెప్పుకురావటం విశేషం. అంటే అన్ని ర్యాక్‌లకు కలిపి రూ. కోటిన్నర వరకు వసూలు టార్గెట్‌గా పెట్టిమరీ వసూలు చేస్తున్నారని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిట్లా ఉంటే... ఇక్కడి నేతలు, ఇక్కడి వ్యాపారులు చాలరన్నట్లు ఏకంగా ఏలూరుకు చెందిన నేత పేరుకూడా తెరపైకి ఓ వ్యాపారి తీసుకురావటంతో స్థానిక వ్యాపారులు విస్తుపోతున్నారు. ఇదంతా ఆయా పార్టీల నేతలకు తెలుసో! లేదో! కానీ ఇక్కడ వ్యాపారులు మాత్రం తెనాలి అడ్డాగా కొందరు కూటమి నేతలకు పనికట్టుకుని మరీ చెడ్డపేరు తీసుకొస్తున్నారు. అయితే ఇప్పటికైనా నేతలు మేల్కొని ఈ అక్రమ వసూళ్ల దందాకు తెరదింపుతారో లేదో!.

ప్రణాళికాబద్ధమైన కృషితోనే..

● పదో తరగతిలో అత్యధిక మార్కులు ● స్కీమ్ ఆఫ్ వాల్యుయేషన్‌పై అవగాహన ఉండాలి ● విద్యార్థుల మనోగతం వారి మాటల్లోనే...

ఆ విద్యార్థులు పదిలో మెరుగైన ఫలితాలు సాధించారు... దీని వెనుక వారు ప్రణాళికాబద్ధంగా చేసిన కృషి, ప్రతిరోజు సబ్జెక్టుల్ని పునఃశ్చరణ చేసుకోవడం....పాఠశాల విద్యాశాఖ జారీ చేసిన స్కీమ్ ఆఫ్ వాల్యుయేషన్‌ను అనుసరిస్తూ పరీక్షలకు సిద్ధం అయ్యారు. అత్యుత్తమ మార్కులు వారు కైవసం చేసుకున్నారు. ఒక్కో సబ్జెక్టులో 98శాతంపైగా ఉత్తీర్ణతతో అగ్రస్థానంలో నిలిచారు. ఇలా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల్ని ఆంధ్రజ్యోతి పలకరించింది. ఆ వివరాలు వారి మాటల్లోనే...

-గుంటూరు(విద్య), ఆంధ్రజ్యోతి

ప్రారంభం నుంచే పునఃశ్చరణ



పది తరగతులు ప్రారంభం అయిన నాటి నుంచే ప్రతిరోజు పూర్తయిన పాఠాల్ని పునఃశ్చరణ చేసుకుంటూ పరీక్షలకు సిద్ధం అయ్యాను. ప్రశ్నలకు జవాబులు రాసే విధానంపై ఉపాధ్యా యులు ఇచ్చిన సూచనలు ఉపయోగ పడ్డాయని పదిలో 598 మార్కులు సాధించిన గుంటూరులోని చైత్రా సెంటర్‌కు చెందిన పీవీఎస్ఎస్ శ్రీహసిని తెలిపారు. ఇంటర్‌లో ఎంఈసీ తీసుకుని సీఏ పూర్తిచేయడమే లక్ష్యమని వెల్లడించారు.

-పీవీఎస్ఎస్ శ్రీహసిని

ఐఐటీలో సీటు సాధించడమే లక్ష్యం.....



ఇంటర్‌లో ఎంపీసీ పూర్తిచేసి జేఈఈ పరీక్షలో ర్యాంకు సాధించి ఐఐటీలో సీటు సాధించడమే లక్ష్యమని పదిలో 597 మార్కులు సాధించిన ఆలపాటి జ్యోతిర్మయి తెలిపారు. పదిలో సబ్జెక్టుల వారీగా ప్రణాళికతో చదివినట్లు తెలిపారు. ప్రతి అంశాన్ని వదలిపెట్టకుండా పునఃశ్చరణ చేసినట్లు తెలిపారు. తల్లిదండ్రులు నాగసురేష్, దుర్గాదేవి పరీక్షల సమయంలో ఎంతో సహకరించారని వివరించారు.

-ఆలపాటి జ్యోతిర్మయి


సివిల్స్ చదవడమే లక్ష్యం...



ఇంటర్ తరువాత బీటెక్ పూర్తి చేసి సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సిద్ధమౌతానని పదిలో 594 మా ర్కులు సాధించిన గుంటూరు లోని శ్రీనివాసరావు పేటకు చెందిన ఆళ్ళ యామిని విద్యాధరి వెల్లడించారు. ఇందు కోసం మరిం త కష్టపడి చదువుతానని చెప్పారు. లక్ష్యసాధన కోసం ఎన్ని అడ్డంకులు ఎదురైనా శక్తివంచన లేకుండా శ్రమిస్తానని చెప్పారు.

-యామిని విద్యాధరి

ఐఐటీలో బీటెక్ చేయడమేలక్ష్యం



ఇంటర్ తరువాత జేఈఈ అడ్వాన్స్ ద్వారా ఐఐటీలో సీటు సాధించడమే లక్ష్యమని పదిలో 593 మార్కులు సాధించినట్లు చారుణ్య తెలిపారు. పదిలో సబ్జెక్టుల్ని పూర్తిగా అవగాహన చేసుకోవడంతో పాటు ఎప్పటి పాఠాలు అప్పుడు పూర్తిచేయడం, పాఠశాలలో నిర్వహించే పరీక్షల్లో తప్పులు తెలుసుకుని తుది పరీక్షలకు సన్నద్ధం అయినట్లు వివరించారు. చారుణ్య తెలిపారు.

-చారుణ్య

పలు ప్రాంతాలకు చిలకలూరిపేట-హైదరాబాద్ బస్సుల్లో రిజర్వేషన్

చిలకలూరిపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ చిలకలూరిపేట మధ్య తిరిగే చిలకలూరిపేట డిపో ఆర్టీసీ బస్ సర్వీసులకు నకరికల్లు, పిడుగురాళ్ల, దాచేపల్లి లలో స్టేజీలు, రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తున్నట్టు స్థానిక ఆర్టీసీ బస్సు డిపో మేనేజర్ ఎస్ రాంబాబు బుధవారం తెలిపారు. హైదరాబాదు నుండి చిలకలూరిపేటకు 7 సర్వీస్ లు, చిలకలూరిపేట నుంచి హైదరాబాదుకు మరో 7 సర్వీసులు తిరుగుతున్నాయని ఆయన చెప్పారు. వీటిలో బీహెచ్ఈఎల్‌కు వెళ్ళే ఇంద్ర ఏసీ బస్ సర్వీసులు కూడా ఉన్నాయని పేర్కొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

వీరయ్య చౌదరి హత్యకు ఎమ్మెల్యే ప్రత్తిపాటి ఖండన

చిలకలూరిపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో జరిగిన సంతనూతలపాడు మాజీ ఎంపీపీ వీరయ్య చౌదరి హత్యను స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు బుధవారం తీవ్రంగా ఖండించారు. హత్యకు బాధ్యులైన వారు ఎవరైనా, ఎంతటి వారైనా చట్టం నుంచి తప్పించుకోలేరని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం దోషుల్ని గుర్తించి, త్వరలోనే వారికి కఠిన శిక్ష పడేలా చేస్తుందని అన్నారు. వీరయ్య చౌదరి కుటుంబానికి ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

జనసేన పార్టీ కార్యాలయంలో పార్టీ జెండా అవనతం

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట జనసేన పార్టీ కార్యాలయంలో ఆదేశానుసారం పెహల్గాం ఉగ్రవాద దాడిలో మృతులకు జనసేన ఆధ్వర్యంలో మూడు రోజులపాటు సంతాప దినాలు పాటిస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం నరసరావుపేట జనసేన పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలానీ ఆధ్వర్యంలో మొదటి రోజు జెండాను అవనతం (సంగం దించటం) చేశారు. కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు జీవీఎస్ ప్రసాద్, రొంపిచర్ల మండల అధ్యక్షుడు అచ్చుల సాంబశివరావు,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: జనసేన పార్టీ మూడు రోజులు పాటు సంతాపదినాలు పాటిస్తున్నట్టు జనసేన పార్టీ సమన్వయకర్త తోట రాజా రమేష్ బుధవారం తెలిపారు. ఉగ్రవాదుల దారుణ మారణకాండను ప్రతి ఒక్కరూ ఖండించి, మృతుల కుటుంబాలకు అండగా నిలవాలన్నారు.

ఉమ్మడివరంలో ఘనంగా గంగమ్మతల్లి తిరునాళ్ల

వినుకొండ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉమ్మడివరంలో గంగమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవాన్ని భక్తులు బుధవారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచే మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని దేవస్థాన ఆవరణలో భక్తిశ్రద్ధలతో పొంగళ్లు నిర్వహించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. రాత్రి సమయంలో భారీ విద్యుత్ ప్రభలపై పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ వీరగంధం ఆనంద్‌తో పాటు గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

వేల్పూరులో గంగమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ

వేల్పూరు (శావల్యాపురం) ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేల్పూరులో గంగమ్మ తల్లి, పోతురాజు విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు భారీసంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించుకొని అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేకపూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జడ్పీటీసీ పారా హైమావతి, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని స్వామివార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం దేవాలయంలో భక్తులు పాల్గొని భజన కార్యక్రమాలు నిర్వహించారు.

చికిత్స పొందుతూ ఫొటోగ్రాఫర్ మృతి

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 23, (ఆంధ్రజ్యోతి), వారం రోజుల క్రితం సత్తెనపల్లి రోడ్డులోని స్టేడియం వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడిన సురేష్ (36) పట్టణంలోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మండలంలోని ఇసప్పాలెం గ్రామానికి చెందిన సురేష్ పట్టణంలో ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు. వారం రోజుల క్రితం ఇస్సపాలెం నుంచి నరసరావుపేటకు వస్తుండగా స్టేడియం వద్ద మోటార్ సైకిల్ అదుపుతప్పి తీవ్రంగా గాయపడ్డాడని రెండో పట్టణ సీఐ హైమారావు తెలిపారు.

గార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ పుస్తక దినోత్సవం

చిలకలూరిపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక జ్ఞనేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ (గార్డ్స్) ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ పుస్తక దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా ఆది ఆంధ్రా కాలనీ ప్రాథమిక పాఠశాల, సంజీవనగర్ ప్రాథమిక పాఠశాలలోని 200 మంది విద్యార్థులకు ఉచితంగా కథల పుస్తకాలు పంపిణీచేశారు. ఈ సందర్భంగా బాలసాహిత్య రచయిత దార్ల బుజ్జిబాబు మాట్లాడుతూ ఈ వేసవి సెలవులలో విద్యార్థులకు పుస్తక పఠనం అలవాటు చేయాలనే సంకల్పంతో బాలసాహిత్యానికి సంబంధించిన కథల పుస్తకాలు పంపిణీ చేసినట్టు తెలిపారు. సంస్థ ఉపాధ్యక్షుడు గేరా యాకోబు, కార్యదర్శి పొనుగుబాటి బుల్లిబాబు, సంస్థ సలహాదారులు మాజీ ఏజీపీ దాసరి చిట్టిబాబు, పాఠశాలల హెచ్ఎంలు పులిపాటి నరసింహారావు, పరుచూరి శైలజ, ఐద్వా అధ్యక్షురాలు పేరుబోయిన భారతి పాల్గొన్నారు.

జిల్లాలో పదో తరగతిలో 84.15 శాతం ఉత్తీర్ణత

● 9552300009 నంబరు నుంచి ఫలితాల పీడీఎఫ్ డౌన్‌లోడ్ చేసుకోండి ● డీఈవో చంద్రకళ

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలో పదో తరగతి పరీక్షలలో 84.15 శాతం ఉత్తీర్ణత సాధించారని డీఈవో ఎల్ చంద్రకళ బుధవారం తెలిపారు. వాట్సాప్‌లో 9552300009 నంబరుకు హాయ్ అని మేసేజ్‌పంపి, విద్యా సేలను ఎంచుకొని, ఆపై ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షల ఫలితాలను, ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియేట్ ఫలితాలు ఎంచుకొని, వారి రోల్ నంబరును నమోదు చేయడం ద్వారా ఫలితాల పీడీఎఫ్ పొందవచ్చు అన్నారు. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వారి పాఠశాల లాగిన్‌ల ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు అన్నారు. ఎల్ ఈఏపీ మొబైల్ యాప్ ఉపాధ్యాయులు, విద్యార్థుల లాగిన్‌ల ద్వారా కూడా ఫలితాలు పొందే సౌలభ్యం కల్పించారన్నారు.

రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి

ఎస్ఎస్‌సీ రెగ్యులర్ అభ్యర్థులు ఆన్‌లైన్‌లో మాత్రమే రీ కౌటింగ్, రీ వెరిపికేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని డీఈవో ఎల్ చంద్రకళ తెలిపారు. 24వ తేదీ నుంచి మే 1 వరకు రాత్రి 11 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని వివరించారు. దరఖాస్తుదారులు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుల వారి ద్వారా రుసుము ఆన్‌లైన్‌లో చెల్లించాలని పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితిలో సీఎఫ్ఎంఎస్ సిటిజెన్ చలానా ద్వారా చేసిన చెల్లింపులు ఆమోదించమన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియెట్ దూరవిద్య అభ్యర్థులు రీ కౌటింగ్, రీ వెరిఫికేషన్ కోసం 26 నుంచి మే 5వరకు ఏదయినా ఏపీఆన్‌లైన్ సర్వీస్ సెంటర్‌లో మాత్రమే నేరుగా రుసుము చెల్లించాలన్నారు. డీడీ, ఇతర విధాలైన చెల్లింపులు అంగీకరించ బడవన్నారు. అడ్వాన్స్ సప్లిమెంటరీ రెగ్యులర్ ఎస్ఎస్‌సీ పరీక్షలు మే 19 నుంచి 28 మేరకు ఉదయం 9.30 గంటల నుంచి 12.45 వరకు నిర్వస్తామని చెప్పారు. ఫీజులు 24వ తేదీనుంచి 30వ తేదీ వరకు చెల్లించవచ్చునన్నారు. దూరవిద్య ఎస్ఎస్‌సీ మే 19 నుంచి 24 వరకు ఉదయం 9.30 గంటల నుంచి 12.45 వరకు పరీక్షలు జరుగుతాయని, ఫీజులు ఈ నెల 26 నుంచి మే 5 వరకు చెల్లించవచ్చు అన్నారు. దూర విద్య ఇంటర్మీయేట్ మే 19 నుంచి 24వ తేదీ వరకు ఉదయం 9.30 గంటల నుంచి 12.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, ఫీజుల ఈ నెల 26 నుంచి మే 5 వరకు చెల్లించవచ్చు అన్నారు. అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల తేదీలు మార్చి 2025 మాదిరిగా ఏపీఓఎస్ఎస్ ఎస్ఎస్‌సీ టైమ్ టేబుల్‌లో అనుసంధానిచబడి, అదే సమయం తేదీలలో రెగ్యులర్ ఎస్ఎస్‌సీ పరీక్షా కేంద్రంలలలో ఓపెన్ స్కూల్ విద్యార్థులు కూడా పరీక్షలు రాస్తారని డీఈవో ఎల్ చంద్రకళ తెలియజేశారు.

పది ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రత్తిపాటి అమూల్య (593)



పిట్టల విజయ లక్ష్మి (591)

నాదెండ్ల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పదో తరగతి పరీక్షల్లో నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు అత్యధిక మార్కులతో ఘన విజయం సాధించారు. మండలంలోని తూబాడు జడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని పత్తిపాటి అమూల్య 593 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానం, చిరుమామిళ్ళ గ్రామంలోని నడికట్టు రామిరెడ్డి ఉన్నత పాఠశాలకు చెందిన పిట్టల విజయలక్ష్మి 591 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచింది. మండలంలో మొత్తం 11 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా రామిరెడ్డి ఉన్నత పాఠశాలలో 69మంది పరీక్షలు రాయగా 69మంది ఉత్తీర్ణులయ్యారు. కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల 34కి 34 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిని ఎంఈవో కృష్ణారెడ్డి, గోల్కొండ గ్రూపు సంస్థల అధినేత నడికట్టు రామిరెడ్డిలు అభినందించారు. అదేవిధంగా సాతులూరు హైస్కూల్‌లో విద్యార్థులు 61లో51, కనపర్రు విద్యార్థులు 35లో27, తూబాడులో 31లో29, సంక్రాంతిపాడులో 20కి18, నాదెండ్ల విద్యార్థులు 48లో38మంది, అమీన్‌సాహెబ్‌పాలెంలో 35లో32మంది, గణపవరం విద్యార్థులు154లో114, ఎండుగుంపాలెం 34లో21, ఏపీ మోడల్ పాఠశాల విద్యార్థులు 64లో62మంది ఉత్తీర్ణులయ్యారు.

● వినుకొండ టౌన్: వినుకొండ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చిన ఫలితాలను పరిశీలిస్తే.. ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో 77లో72 మంది ఉత్తీర్ణులై బి.భానుమిత్ర 563 అత్యధిక మార్కులు సాధించింది. చీకటీగలపాలెం మోడల్ పాఠశాలలో 93లో92మంది ఉత్తీర్ణులయ్యారు. టి.సాయిరామ్ 591మార్కులు సాధించాడు. మహాత్మ జ్యోతిరావుపూలే బీసీ బాయ్స్ హైస్కూల్‌లో 20లో18మంది ఉత్తీర్ణులై జి.వెంకటరాజు 514మార్కులు సాధించాడు. జడ్పీహెచ్ (బాలికలు) పాఠశాలలో 223లో196మంది ఉత్తీర్ణులయ్యారు. వి. చైతుర్యా, జె.ఖాతిజా 591మార్కులు సాధించారు. నిర్మలా గర్ల్స్ పాఠశాలలో 48లో41మంది ఉత్తీర్ణులయ్యారు. బి.లలిత 587 మార్కులు సాధించింది. గిరిజన బాలికల పాఠశాలలో 37లో32మంది ఉత్తీర్ణులయ్యారు. ఎస్‌కే సమీరా 552మార్కులు సాధించింది. జడ్పీహెచ్ఎస్ (ఉర్దూ) పాఠశాలలో 21లో18మంది ఉత్తీర్ణులయ్యారు. ఎస్‌కే ఎస్‌కే. రహిమున్నీసా 541 మార్కులు సాధించింది. ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ బాలుర పాఠశాలలో 28లో24మంది ఉత్తీర్ణులయ్యారు జె.సోమ్లానాయక్ 532 మార్కులు సాధించాడు. నడిగడ్డ జడ్పీహెచ్ పాఠశాలలో 46లో36మంది ఉత్తీర్ణులయ్యారు ఎన్.అంకమరావు 558మార్కులు సాధించాడు. లయోలా హైస్కూల్ 40లో30మంది ఉత్తీర్ణులయ్యారు ఈ.డానియేలు 501మార్కులు సాధించాడు. కేజీబీవీ పాఠశాలలో 38లో 27మంది ఉత్తీర్ణులయ్యారు బి.త్రివేణి 565మార్కులు సాధించాడు. జడ్పీహెచ్ (కొత్తపాలెం) పాఠశాలలో 32లో19మంది ఉత్తీర్ణులయ్యారు. జి.వైష్ణవి 510 మార్కులు సాధించింది. కంచర్ల జిల్లా పరిషత్ పాఠశాలలో 47లో30మంది ఉత్తీర్ణులయ్యారు పి.వరుణ్‌సందేష్ 517మార్కులు సాధించాడు. నాగులవరం జడ్పీహెచ్ పాఠశాలలో 61లో 37మంది ఉత్తీర్ణులయ్యారు ఎం.ఆదిత్యారెడ్డి 570 మార్కులు సాధించాడు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 117లో 64 మంది ఉత్తీర్ణులయ్యారు దనీష్ 558మార్కులు సాధించాడు. మొత్తం 911లో730మంది ఉత్తీర్ణులై 80శాతంతో అగ్రగామిగా నిలిచారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను మండల విద్యాశాఖ అధికారి జఫ్రుల్లా దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు.



టి.సాయిరామ్ (591)

చిలకలూరిపేట మండలంలో...

చిలకలూరిపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండల పరిధిలో ఉన్న 14 జిల్లా పరిషత్, మునిసిపల్, రెసిడెన్షియల్, ట్రైబల్ వెల్ఫేర్, కస్తూరిబా గాంధీ, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులు 10వ తరగతి పరీక్షలలో 73శాతం ఉత్తీర్ణత సాధించారు. పరీక్షలకు మొత్తం 860మంది విద్యార్థులు హాజరుకాగా 627మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. చిలకలూరిపేట ఎంఈవో ఎ.శ్రీనివాసరావు బుధవారం తెలిపిన వివరాల ప్రకారం పోతవరంలోని కస్తూరిబాగాంధీ బాలికల పాఠశాల విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు. పట్టణంలోని ఆర్‌వీఎస్‌సీవీఎస్ హైస్కూల్ విద్యార్థులు 95.65 శాతం ఉత్తీర్ణతతో ద్వితీయ స్థానంలో నిలిచారు. 89.29శాతం ఉత్తీర్ణతతో పసుమర్రు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు, 89.19 శాతం ఉత్తీర్ణతతో వేలూరు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు వరుసగా తృతీయ, చతుర్థ స్థానాల్లో నిలిచారు. పసుమర్రు జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన నార్నేపాటి పార్వతి 600 మార్కులకు గాను 586 మార్కులు, పఠాన్ మహమ్మద్ అల్తాఫ్ 585 మార్కులు సాధించి మండలంలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. కోమటినేనివారిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని కె.ప్రశాంతి 583 మార్కులు సాధించి మండలంలో తృతీయ స్థానంలో నిలిచింది.



591మార్కులు వచ్చిన విద్యార్థులను దుశ్శాలువాలతో అభినందిస్తున్న ఎంఈవో జఫ్రుల్లా

● శావల్యాపురం: మండలంలోని ఐదు జడ్పీ పాఠశాలల నుంచి 250మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా వారిలో 224మంది ఉత్తీర్ణులయ్యారు. 89.6శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు ఎంఈవోలు సాంబశివరావు, లలితాకుమారిలు బుధవారం తెలిపారు. వారు మాట్లాడుతూ శావల్యాపురం జడ్పీ పాఠశాలల్లో 77లో 70 (91శాతం), వేల్పూరు జడ్పీ పాఠశాలల్లో 46లో 44 (96శాతం), పొట్లూరు జడ్పీ పాఠశాల్లో 46లో 42 (91శాతం), మతుకుమల్లి జడ్పీ పాఠశాలల్లో 40లో37 (92.5శాతం), కారుమంచి జడ్పీ పాఠశాల్లో 41లో31 మంది (76శాతం) ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. శావల్యాపురం జడ్పీ పాఠశాలల్లో పద్మనాభుని జ్యోతిర్మయి 587, లింగాల గాయత్రి 586, చెన్నంశెట్టి శివనాగలక్ష్మి 584, వేల్పూరు జడ్పీ పాఠశాలల్లో కామేపల్లి నాగరోషిణి 584, పోట్లూరు జడ్పీ పాఠశాలలో సొలస రూపశ్రీ 582 మార్కులను సాధించినట్లు తెలిపారు.

● ఈపూరు: 10వ తరగతి పరీక్షల్లో ఈపూరు మండలంలో 74.90 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో ఏ రామతులసి తెలిపారు. బుధవారం వెలువడిన ఫలితాలలో 415మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 311మంది ఉత్తీర్ణ సాధించారు. ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థి గోపాలుని నాగసాయి తేజకు 586 మార్కులు సాధించాడు. కొండ్రముట్ల హైస్కూల్ విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించగా ఈపూరు హైస్కూల్ విద్యార్థులు 60శాతం ఉత్తీర్ణత సాధించారు. అదేవిధంగా ఇనిమెళ్ల హైస్కూల్ 81.30శాతం, ముప్పాళ్ళ హైస్కూల్ విద్యార్థులు 80.20శాతం, బొగ్గరం హైస్కూల్ విద్యార్థులు 97.40శాతం, కొచ్చర్ల 83.30శాతం, ఏపీ మోడల్ స్కూల్ 76.30శాతం, కేజీబీవీ 88.50శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో తెలిపారు. అలాగే శ్రీవిద్యానికేతన్ విద్యార్థిని యర్రం అనూష 592మార్కులు సాధించింది.

● రొంపిచర్ల: మండలంలోని గ్రామాల్లో జడ్పీ పాఠశాలల విద్యార్థులు బుధవారం వెలువరించిన ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. గోగులపాడు జడ్పీ పాఠశాల విద్యార్థి వై.నిరాజిత్ కుమార్ 589, ఏపీ మోడల్ పాఠశాల విద్యార్థి జానివి588, సంతగుడిపాడు జడ్పీ పాఠశాల విద్యార్థి 586, ఏపీ మోడల్ పాఠశాల విద్యార్థి రమావత్ మోతీబాయి 586 మార్కులు సాధించారు. గోగులపాడు పాఠశాల విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. బుచ్చిపాపన్నపాలెం పాఠశాల విద్యార్థులు, 74, సంతగుడిపాడు జడ్పీ పాఠశాల విద్యార్థులు 94.83, కేజీబీవీ పాఠశాల విద్యార్థులు 97.50, రెడ్డిపాలెం జెడ్పీ పాఠశాల విద్యార్థులు 74.07, కొత్తపల్లి పాఠశాల విద్యార్థులు66.67, ఏపీ మోడల్ పాఠశాల విద్యార్థులు 92.47, రొంపిచర్ల పాఠశాల విద్యార్థులు 98.31శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలం మొత్తం మీద 399కి360 మంది ఉత్తీర్ణత సాధించారు. గోగులపాడు జడ్పీ పాఠశాల విద్యార్థులు పవన్ 571, హెక్సిబ 556, రొంపిచర్ల జడ్పీ పాఠశాల విద్యార్థులు భార్గవసాయి లక్ష్మి 581, శ్రీవిద్య 579, గోపాల కృష్ణమాచార్యులు 578, ఏపీ మోడల్ పాఠశాల విద్యార్థిని వైష్ణవి 585, కొత్తపల్లి ఎన్.జాషువా 519, ప్రేమ్‌కుమార్ 505, ఇందు 466మార్కులు సాధించారు. రెడ్డిపాలెం జడ్పీ పాఠశాల విద్యార్థులు ఆసిని 561, కీర్తి 549, జయదీప్ 538 మార్కులు సాధించారు. సంతగుడిపాడు కేజీబీవీ పాఠశాల విద్యార్థులు హేమలత 551, త్రివేణి 532, విజయలక్ష్మి 509 మార్కులు సాధించారు. సంతగుడిపాడు జడ్పీ పాఠశాల విద్యార్థులు లక్ష్మీ మురారి 583, కీర్తన 575, బుచ్చిపాపన్నపాలెం పాఠశాల విద్యార్థులు రామ నమ్రత 539, సాయి ప్రసాదు 531, తేజ510 మార్కులు సాధించారు.

● యడ్లపాడు: పదో తరగతి ఫలితాలలో ప్రభుత్వ పాఠశాలల్లో 81.03శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు ఎంఈవో నాగరత్నం తెలిపారు. మండలంలో తొమ్మిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతోపాటు, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు ఉండగా ఆయా పాఠశాలల నుంచి 398లో319మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. ఉత్తీర్ణతలో వంకాయలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 97 శాతంతో ప్రథమ స్థానంలో నిలువగా 65శాతం ఉత్తీర్ణతతో కారుచోల ఆఖరి స్థానంలో నిలిచింది. కాగా ఉన్నవ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు కె.జయలక్ష్మి, బి.ఫణీంద్రసాయిలు 566/600 మార్కులు సాధించి మండల టాపర్‌లుగా నిలిచారు.



సేద్యపు విభాగంలో మొదటి బహుమతి సాధించిన గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం పెద్దగొట్టిపాడు ఎడ్లు

న్యూకేటగిరిలో పెద్దగొట్టిపాడు ఎడ్లకు మొదటిస్థానం

వినుకొండ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మదమంచిపాటి వీరాంజనేయస్వామి తిరునాళ్ల సందర్భంగా ఏర్పాటుచేసిన జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీల్లో మంగళవారం రాత్రి న్యూకేటగిరిలో గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం పెద్దగొట్టిపాడుకు చెందిన గరికపాటి లక్ష్మణ చౌదరికి చెందిన ఎడ్లు 5116 అడుగులు లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. బాపట్ల జిల్లా చుండూరి మండలం వేటపాలెంకు చెందిన అత్తోటి శిరీషాచౌదరి, శివకృష్ణచౌదరి ఎడ్లు 5వేలు అడుగులు లాగి 2వ స్థానం, పల్నాడు జిల్లా క్రోసూరు మండలం ఉయ్యందన గ్రామానికి చెందిన సంపటి వీరబ్రహ్మంనాయుడుకు చెందిన ఎడ్లు 4805 అడుగులు లాగి 3వ స్థానంలో నిలిచాయి. గుంటూరు జిల్లా పెదకాకాని కొప్పురావూరికి చెందిన తోట శ్రీనివాసరావు ఎడ్లు 4760 అడుగులు లాగి 4వ స్థానం, పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఎడ్లు 4750 అడుగులు లాగి 5వ స్థానంలో నిలిచాయి.

బహిరంగ మద్యపానంపై ప్రత్యేక దాడులు



పల్లెనిద్రలో పాల్గొన్న నరసరావుపేట మొదటి పట్టణ పోలీసులు

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 23, (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఈ నెల 22వ తేదీ రాత్రి జిల్లా వ్యాప్తంగా బహిరంగ మద్యపానంపై ప్రత్యేక దాడులు నిర్వహించినట్లు ఎస్పీ కార్యాలయం బుధవారం ఓ ప్రకటనలో పేర్కొంది. పల్నాడు జిల్లాలోని బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించినా, మద్యం సేవించి వాహనాలు నడిపినా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా రాత్రివేళ ప్రధాన రహదారులపై పోలీసు అధికారులు సిబ్బంది విస్తృతంగా వాహనాల తనిఖీ చేశారు. ఖాళీ ప్రదేశాలు శివారు ప్రాంతాల్లోనూ బహిరంగంగా మద్యం సేవించే వారిపై పోలీసు అధికారులు దాడులు నిర్వహించి 132కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. సాయంత్రం వాహన తనిఖీలు చేపట్టి పోలీసు అధికారులు సిబ్బంది రహదారి భద్రత నిబంధనలు ఉల్లంఘించి, మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేశారు. కాగా జిల్లా వ్యాప్తంగా మంగళవారం రాత్రి పోలీసులు పల్లె నిద్ర కార్యక్రమం చేపట్టారు. నరసరావుపేట మొదటి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని వ రవకట్ట, ఈపూరు మండలం బొగ్గరం, అచ్చంపేట, పిడుగురాళ్ల మండలం జూలకల్లు, దుర్గి మండలం ఆత్మకూరు లలో పోలీసులు పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు.



నిరుపయోగంగా ఉన్న విలేజి క్లినిక్ భవనం

నిరుపయోగంగా కంచర్ల విలేజి క్లినిక్

● రెండేళ్లయినా కనీసం ప్రారంభించనే లేదు

వినుకొండ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదకంచర్ల గ్రామంలో సుమారు రెండు సంవత్సరాల క్రితం నిర్మించిన విలేజి క్లినిక్ ఇంత వరకు ప్రారంభానికి నోచుకోలేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించి విలేజి క్లినిక్ పేరు కూడా కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వైఎస్సార్ విలేజి క్లినిక్‌గానే ఉంది. విలేజి క్లినిక్‌కు విద్యుత్ సరఫరా ఏర్పాటుచేసి దీనిని ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు గ్రామస్థులు కోరుతున్నారు.



యామినిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

సివిల్స్‌కు ఎంపికైన యామినికి సత్కారం

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): సివిల్స్‌లో ఐఆర్ఎస్‌కు ఎంపికైన అంబటి యామినిని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు బుధవారం తన కార్యాలయంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ నరసరావుపేట ఎడ్యుకేషన్ హబ్‌గా ఎంతోమంది విద్యార్థులను ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్లుగా తయారువుతున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం విద్యకు ఎంతో ప్రాధాన్యం ఇస్తుందని, విద్యాశాఖ మంత్రి విద్య వ్యవస్థలో ఎన్నో సంస్కరణలు తెస్తున్నారని అన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో తల్లికి వందనం కార్యక్రమం అమలు చేస్తామని తెలిపారు.

ఉప్పరపాలెం గ్రామస్థులకు స్వచ్ఛమైన నీరు సరఫరా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వినుకొండ టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరపాలెం నిరుపేదలకు సింగరచెరువు నుంచి శుద్ధి చేయని జలాలు పంపిణీ చేస్తుండటంపై ఇటీవల ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సుమారు రూ.8లక్షల వ్యయంతో సింగరచెరువు నుంచి స్వచ్ఛమైన నీటిని రక్షిత తాగునీటి పథకం వద్ద గతంలో ఏర్పాటుచేసిన ఫిల్టర్ బెడ్లకు పంపి రెండు రోజుల నుంచి పంపిణీ చేస్తుండటంతో గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గ్రామసర్పంచ్ గోపు శ్రీనివాసరావుతో పాటు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి రక్షిత తాగునీటి పథకానికి మరమ్మతులు చేపట్టడంపై ఉప్పరపాలెం వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

హత్యాయత్నం కేసు సీఐడీకి అప్పగించటంపై హర్షం

వినుకొండ టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): తనపై జరిగిన హత్యాయత్నం కేసును సీఐడీకి అప్పగించేందుకు ఎస్పీ కంచి శ్రీనివాసరావు చర్యలు చేపట్టటంపై భారతీయ జనతా పార్టీ పల్నాడు జిల్లా కార్యదర్శి మేడం రమేష్ బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో 2021 ఆగస్టు 13వ తేదీన కొందరు రోడ్డుపై కాపుకాసి తనపై హత్యాయత్నానికి పాల్పడ్డారన్నారు. స్థానికుల చొరవతో గాయాలతో బయటపడ్డానన్నారు. కేసులో ప్రధానంగా అప్పటి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుతో పాటు మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావులే దాడికి ప్రధాన కారణమని అప్పట్లో పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేశానని, అయితే కేసులో నేటికి పురోగతి లేదన్నారు. హత్యాయత్నానికి పాల్పడిన నిందితులు ఎవరనేది తేలలేక పోవటంతో దీనిపై జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు కేసును సీఐడీకి అప్పగిస్తున్నట్లు బుధవారం ఉత్తర్వులిచ్చారని రమేష్ తెలిపారు. ఇప్పటికైనా దోషులను గుర్తించి కఠినంగా శిక్షించాలని మేడం రమేష్ డిమాండ్ చేశారు.

ఉపాధి కూలీలపై కక్ష సాధింపులు దారుణం

● రాష్ట్ర కాపు యువసేన అధ్యక్షుడు శ్రీనివాసరావు

గంటవారిపాలెం (శావల్యాపురం) ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ కూలీలకు రాజకీయ రంగులు పులిమి వారిపై కక్ష సాధింపులకు పాల్పడడం దారుణమని కాపు యువసేన రాష్ట్ర అధ్యక్షులు కర్లా శ్రీనివాసరావు విమర్శించారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ శావల్యాపురం మండలం గంటవారిపాలెంలో నాలుగు ఉపాధి హామీ కూలీల గ్రూపులుండగా వారిలో ఒక గ్రూపులోని 60మంది కూలీలను గ్రామ నాయకుల ఒత్తిడి మేరకు ఫీల్డ్ అసిస్టెంట్ ఉపాధి హామీ పనులకు రావద్దని చెప్పాడని, దినిపై ప్రశ్నించగా గ్రామ నాయకులు వద్దన్నారని వెల్లడించారన్నారు. దీనిపై ఉపాధి హామీ కూలీలు తీవ్ర ఆందోళనకు గురయ్యారని తెలిపారు. విషయాన్ని డ్వామా పీడీ సిద్దలింగమూర్తి దృష్టికి తీసుకెళ్ళగా కూలీలకు పని కల్పించేలా చర్యలు తీసుకొంటానని హామీ ఇచ్చారని తెలిపారు. కూలీలకు పనులు కల్పించకపోతే జనవాణి కార్యక్రమం ద్వారా ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళతామని తెలిపారు.